- aruhi group
www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

బుధవారం
28-10-2026

సంపుటి : 01 సంచిక : 216 పేజీలు : 08 వెల : ₹5/-

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 216 NAMASTEY MAHAAPRABHA



అభిషేక్ శతక విధ్వంసం

మూడో టీ20లో న్యూజిలాండ్‌పై భారత్ ఆరు వికెట్ల తేడాతో విజయం

- ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 3--0 ఆధిక్యంతో సిరీస్ కైవసం
- 38 బంతుల్లో 113 పరుగులతో చెలరేగిన అభిషేక్ శర్మ
- కేవలం 35 బంతుల్లోనే శతకం పూర్తి చేసిన భారత ఓపెనర్
- వైభవ్ సూర్యవంశీ 45 పరుగులు.. తొలి వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యం
- పవర్‌ప్లేలో 118 పరుగులు సాధించిన భారత బ్యాటర్లు
- 13.2 ఓవర్లలోనే 199 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన భారత్
- కివీస్ తరఫున డారిల్ మిచెల్ 89 పరుగులతో పోరాటం

03

న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో భారత బ్యాటర్లు పరుగుల వర్షం కురిపించారు. ఓపెనర్ అభిషేక్ శర్మ విధ్వంసకర శతకంతో చెలరేగడంతో భారత్ ఆరు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. వెల్లింగ్టన్ వేదికగా జరిగిన పోరులో న్యూజిలాండ్ నిర్దేశించిన 199 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా కేవలం 13.2 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించింది. అభిషేక్ 35 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి, 38 బంతుల్లో 113 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 45 పరుగులు చేయగా, వీరిద్దరూ తొలి వికెట్‌కు 133 పరుగులు జోడించి విజయానికి పునాది వేశారు. పవర్‌ప్లే ఆరు ఓవర్లలోనే భారత్ 118 పరుగులు సాధించింది. అంతకుముందు డారిల్ మిచెల్ 89 పరుగులతో రాణించడంతో న్యూజిలాండ్ 198 పరుగులు చేసింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ 3--0 ఆధిక్యంతో మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే కైవసం చేసుకున్నట్లు అందించిన మ్యాచ్ వివరాలు పేర్కొంటున్నాయి.

సమ్మిట్‌ను సక్సెస్ చేద్దాం

ప్రపంచ వేదికపై తెలంగాణ సత్తా చాటాలి!



- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను విజయవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- డిసెంబర్ 7 నుంచి ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు
- అక్టోబర్ 29న ఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమం
- నవంబర్ తొలి వారంలోగా అన్ని ఏర్పాట్ల ప్రణాళికలు ఖరారు చేయాలని ఆదేశం
- దేశవిదేశాల నుంచి వచ్చే పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులకు ఇబ్బందులు కలగొద్దని సూచన
- హైదరాబాద్ నగరవ్యాప్తంగా డ్రోన్లతో వినూత్న ప్రచారానికి ఏర్పాట్లు
- కృత్రిమ మేధ, వాతావరణ మార్పుల రంగాల అంతర్జాతీయ ప్రముఖులకు ఆహ్వానం
- కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయం, బతుకమ్మ సంస్కృతి ప్రతిబింబించేలా సదస్సు ప్రాంగణం

/హైదరాబాద్: అక్టోబర్ 27(మహా ప్రభ)

గ్లోబల్ సమ్మిట్ నిర్వహణతో తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ఠ ప్రపంచ స్థాయిలో మరింతగా పెరిగే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ నెల 29న ఢిల్లీలో జరగనున్న కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. డిసెంబర్‌లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిపై మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ ప్రోగ్రామ్, జాతీయశీక పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలతో సమావేశాలు, రక్షణ ఎక్స్‌పో, ఇండియా జాయ్ ఈవెంట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

-మిగతా 3 లో



03

దాడులు ఆపితే ఒక బిలియన్ డాలర్‌లు ఇస్తాం

హౌతీలకు సౌదీ భారీ ఆఫర్..!



రూట్ మార్చిన కాంగ్రెస్!

- 'చలో దిల్లీ'కి ప్రత్యేక రైళ్లకు కేంద్రప్రభుత్వం నిరాకరణ
- స్లీపర్ బస్సుల్లో హస్తినకు వెళ్లాలని నేతల నిర్ణయం

03



వచ్చే ఎన్నికల్లో వంద సీట్లే మా లక్ష్యం!

- తెలంగాణలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందన్న టీపీసీసీ చీఫ్
- అసెంబ్లీ ఎన్నికల్లో 100 స్థానాలు సాధించడమే లక్ష్యమని మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడి
- నవంబర్ తర్వాత ఎన్నికల సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి
- కేటీఆర్, హరీశ్‌రావు క్షేత్రస్థాయి వాస్తవాలు తెలుసుకోవాలని సూచన
- సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే తమ బలమని వ్యాఖ్య
- ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, ఉద్యోగాల భర్తీపై ప్రజల్లోకి వెళ్తామని వెల్లడి
- గత బీఆర్ఎస్ పాలన రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శ
- తెలంగాణలో బీజేపీకి రాజకీయ భవిష్యత్తు లేదని మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యలు

హైదరాబాద్, అక్టోబర్ 27(మహా ప్రభ)

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో 100 స్థానాలను సాధించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలని సూచించారు. సచివాలయంలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, రాబోయే ఎన్నికల సన్నద్ధతపై పలు అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న కొన్ని సమస్యలకు నవంబర్‌లో పరిష్కారం

-మిగతా 3 లో



ఇంకో ఏడాదే.. ఆ తర్వాత కేసీఆర్ వస్తారు!

- కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో మంచి రోజులు వస్తాయని ధీమా
- ప్రజలను విభజించడంలో బీజేపీ.. దోచుకోవడంలో కాంగ్రెస్ బిజీగా ఉన్నాయని విమర్శ
- నిర్మల్‌కు బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీ ఏం చేశారో నిలదీయాలని పిలుపు
- నిర్మల్‌ను జిల్లాగా మార్చింది కేసీఆరేనని గుర్తుచేసిన కేటీఆర్
- వైద్య, నర్సింగ్ కళాశాలలు, సాగునీటి ప్రాజెక్టులు బీఆర్ఎస్ హయాంలోనే వచ్చాయని వెల్లడి
- అవకాశవాదులు వెళ్లిపోయినా పోరాట యోధులు బీఆర్ఎస్‌లోనే ఉన్నారని వ్యాఖ్య

హైదరాబాద్: అక్టోబర్ 27(మహా ప్రభ)

మీ నిర్మల్ తాలూకాలో బీజేపీ ఎమ్మెల్యే ఉన్నరు, బీజేపీ ఎంపీ ఉన్నరు.. నిర్మల్‌కు బీజేపీ ఏం చేసిందో ప్రశ్న అడగాల్సిన సమయం వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్మల్ జిల్లాకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు కేటీఆర్ సమక్షంలో భారీగా చేరారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఢిల్లీలో బీజేపీ ప్రజలను విభజించడంలో బిజీగా ఉంటే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రజలను దోచుకోవడంలో బిజీగా ఉన్నారు.. తప్ప వాళ్లు చేసిందేమీ కాదు.. మహేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యేగా, గోడం నగేశ్ ఎంపీగా గెలిచారు..

-మిగతా 3 లో

ఓటు పరిరక్షణ ఉద్యమం కొనసాగిస్తాం

- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్
- పేదల ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తున్నారని తీవ్ర ఆరోపణ
- ఢిల్లీలోని త్రిలోక్‌పురిలో 'ఓటు హక్కు.. జీవించే హక్కు' ప్రజా విచారణ
- ఎన్నికల సంఘం నుంచి సరైన సమాధానాలు రావడం లేదని విమర్శ
- సీఈసీ రాజీనామా లేదా తొలగింపు వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టీకరణ

03



అర్నాబ్.. ఉగ్రరూపం

తెలుగు రాష్ట్రాలకు తుపాను ముప్పు!


- బంగాళాఖాతంలో అతి తీవ్ర తుపానుగా మారిన 'అర్ణబ్'
- నేడు యానాం సమీపంలో తీరం దాటే అవకాశమని హెచ్చరికలు
- ఆంధ్రప్రదేశ్ తీరంలో బీచ్‌లు, తీరప్రాంత రహదారుల మూసివేత
- 16 జిల్లాల్లోని 2,460 గ్రామాలు, 92 పట్టణ ప్రాంతాలపై ప్రభావం పడే అవకాశం
- 11 జిల్లాలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల తరలింపు
- తెలంగాణలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు భారీ వర్ష సూచన
- మత్స్యకారుల వేటపై నిషేధం.. 30 వేల పడవలు రేవుల్లో నిలిపివేత
- 1,763 సహాయక శిబిరాలు సిద్ధం.. రంగంలోకి 3,185 మంది నోడల్ అధికారులు

03

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' అతి తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాలను వణికిస్తోంది. గంటకు 25 కిలోమీటర్ల వేగంతో దూసుకొస్తున్న తుపాను బుధవారం ఉదయం బాపట్ల--విశాఖపట్నం మధ్య యానాం సమీపంలో తీరం దాటే అవకాశముందని వాతావరణ హెచ్చరికలు పేర్కొంటున్నాయి. భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలుల ముప్పుతో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమై తీరప్రాంత బీచ్‌లు, రహదారులను మూసివేసినట్లు సమాచారం. 16 జిల్లాల్లోని 2,460 గ్రామాలు, 92 పట్టణ ప్రాంతాలపై ప్రభావం పడే అవకాశముండటంతో సహాయక చర్యలను ముమ్మరం చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. తెలంగాణలోని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోనూ అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరికలు వెలువడ్డాయి.







17 మంది ఖైదీలు పరార్

- ఫిట్స్ వచ్చినట్లు నటించి, గార్డులపై దాడి చేసి జంప్
- సిబ్బందిని బంధించి తాళాలు లాక్కున్న ఖైదీలు
- ప్రధాన ద్వారం నుంచి బయటకు పరుగులు
- గార్డు మెడలోని బంగారు గొలుసు కూడా అపహరణ
- పరారైన ఖైదీల కోసం పోలీసుల విస్తృత గాలింపు
- కేరళ సరిహద్దులు, అటవీ ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా
- విధుల్లో నిర్లక్ష్యంపై తొమ్మిది మంది సిబ్బంది సస్పెన్షన్

బ్రేకింగ్ బ్యాడ్, ప్రిజన్ బ్రేక్..

విజయ్ సర్కారుపై మాజీ సీఎం స్టాలిన్ సెటైర్లు..!



న్యూఢిల్లీ:అక్టోబర్ 27(మహా ప్రభ)

: తమిళనాడు లో జోసెఫ్ విజయ్ ప్రభుత్వానికి వరుసగా చిక్కులు ఎదురవుతున్నాయి. ఇటీవలే ఆ పార్టీకి చెందిన కార్యకర్త ఒకరు డ్రగ్స్ అక్రమ రవాణాచేస్తూ పట్టుపడి అధికార పార్టీని ఇరకాటంలో పెట్టాడు. ఇప్పుడు తేనిలోని జైలు నుంచి ఖైదీలు పారిపోవడంతో ప్రభుత్వంపై విమర్శలపాలవుతోంది. వీటిపై మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విమర్శనాస్త్రాలు సంధించారు. మొన్న 'బ్రేకింగ్ బ్యాడ్ ', ఇప్పుడు 'ప్రిజన్ బ్రేక్ ' అంటూ సోషల్ మీడియా లో పోస్టుపెట్టారు.ప్రముఖ వెబ్ సిరీస్‌ల పేర్లతో రాష్ట్రంలోని శాంతి భద్రతలను పోల్చారు. తమిళనాడులో 'బ్రేకింగ్ బ్యాడ్' తర్వాత 'ప్రిజన్ బ్రేక్' మొదలైందని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం బెయిల్‌పై బయట ఉన్న నేరస్థులనే పర్యవేక్షించడం లేదనుకున్నానని, జైలులో ఉన్న ఖైదీలు తప్పించుకుంటున్నా చూస్తూ కూర్చుంటోందని ఇప్పుడు స్పష్టమైందని విమర్శించారు. ఇప్పటికే పుళల్ జైలు నుంచి ఇద్దరు ఖైదీలు తప్పించుకున్న ఘటన మరవకముందే ఇప్పుడు తేని జైలు నుంచి 17 మంది పారిపోయారన్నారు. 1995 తర్వాత ఒకేసారి ఇంతమంది ఖైదీలు పారిపోవడం ఇదే తొలిసారని స్టాలిన్ పేర్కొన్నారు. భద్రతా ఏర్పాట్లు, మెరుగైన సాంకేతికత ఉన్న సమయంలో ఇలాంటి ఘటనలు జరగడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. బయట ఉన్న నేరగాళ్లు స్వేచ్ఛగా నేరాలు చేస్తున్నారని, లోపల ఉన్న ఖైదీలు ధైర్యంగా తప్పించుకుంటున్నారని విమర్శలు చేశారు. మొత్తం మీద ఎవరికీ ఉపయోగపడని ప్రభుత్వం మనదని, వారు ప్రజలను రక్షించరని ఎద్దేవా చేశారు. ప్రజలే తమను తాము కాపాడుకోవాల్సిన పరిస్థితికి తమిళనాడు చేరిందని తీవ్ర విమర్శలు చేశారు. రూ.100 కోట్ల విలువైన 135 కిలోల డ్రగ్స్ అక్రమ రవాణా చేసిన కేసులో ఇటీవల నాగపట్టణానికి చెందిన టీవీకే నేత ఒకరు అరెస్టయ్యారు. దానిపై స్టాలిన్ తీవ్ర విమర్శలు చేశారు. బ్రేకింగ్ బ్యాడ్ అనే వెబ్‌సిరీస్‌ను ప్రస్తావిస్తూ.. టీవీకే 'బ్యాడ్ పార్టీ' మాత్రమే కాదని, 'బ్రేకింగ్ బ్యాడ్ పార్టీ' అని వ్యాఖ్యలు చేశారు. తాజాగా తన పోస్టులో దీనితోపాటు మరో వెబ్ సిరీస్ 'ప్రిజన్ బ్రేక్' పదాన్ని ప్రస్తావించారు.

రాజీవ్ ప్రధాని కావడం నాకుష్టం లేదు

- అనుభవాలను నిజాయితీగా వివరించాను..
- ఫలితంగా, కొందరి అభిప్రాయాలు మారొచ్చు
- ఆత్మకథపై చర్చలో వెల్లడించిన సోనియా గాంధీ
-తన ఆత్మకథలో కుటుంబ జీవితం, రాజకీయ ప్రస్థానం



న్యూఢిల్లీ:అక్టోబర్ 27(మహా ప్రభ)

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తన జీవిత విశేషాలతో రూపొందించిన ఆత్మకథ 'బిలాంగింగ్ : ఎ జర్నీ ఆఫ్ లవ్' ద్వారా తన వ్యక్తిగత జీవితం, కుటుంబ అనుభవాలు, రాజకీయ ప్రస్థానానికి సంబంధించిన అనేక అంశాలను వెల్లడించనున్నారు. తన భర్త రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి కావాలని నిర్ణయించినప్పుడు తాను తీవ్రంగా వ్యతిరేకించానని ఆమె తెలిపారు. ఈ పుస్తకంలో తన అనుభవాలను నిజాయితీగా వివరించానని, అందువల్ల కొందరి అభిప్రాయాలు మారొచ్చని పేర్కొన్నారు. మంగళవారం తన సోషల్ మీడియా ఖాతాలలో విడుదల చేసిన వీడియోలో సోనియా గాంధీ ఈ విషయాలను వెల్లడించారు. తన జీవితంలో చోటు చేసుకున్న సంఘటనలను తన దృక్పథం లో పాఠకులకు తెలియజేసేందుకు ఈ పుస్తకం అవకాశం కల్పించిందని ఆమె వివరించారు. పుస్తకం వెలువడిన తర్వాత ప్రజల్లో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యే అవకాశం ఉందని, బహిరంగ జీవితంలో ఇలాంటివి సహజమని పేర్కొన్నారు.

సోనియా గాంధీ జీవితంలోని వ్యక్తిగత, రాజకీయ అంశాలను ఈ ఆత్మకథ స్పృశించనుంది. ముఖ్యంగా గాంధీ కుటుంబంలో చోటు చేసుకున్న కీలక పరిణామాలు, రాజకీయాల్లోకి రాజీవ్ గాంధీ ప్రవేశం, కుటుంబాన్ని కుదిపేసిన విషాద సంఘటనలు, భారత రాజకీయాల్లో సోనియా గాంధీ పాత్ర వంటి అంశాలు ఇందులో ప్రస్తావనకు రానున్నాయి. ఈ పుస్తకం నవంబర్ 10న విడుదల కానుంది.

ఇటలీలో బాల్యం నుంచి భారత రాజకీయాల వరకు..

సోనియా గాంధీ ఆత్మకథ ఇటలీలోని వెనెటో ప్రాంతంలో ఆమె గడిపిన బాల్యం నుంచి ప్రారంభమవుతుంది. అనంతం రం ఇంగ్లండ్‌లోని కేంబ్రిడ్జ్‌లో చదువుకుంటున్న సమయంలో 1965లో రాజీవ్ గాంధీతో పరిచయం, వారి వివాహం, మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో పరిచయం, భారతీయ జీవనశైలి అలవాటు పడిన తీరు వంటి అంశాలను ఈ పుస్తకం వివరించింది. వ్యక్తిగత జీవితంలోని విషాదాలకే పరిమితం కాకుండా, కాంగ్రెస్ పార్టీ పునర్నిర్మాణంలో సోనియా గాంధీ పాత్ర, పార్టీ నాయకత్వ బాధ్యతలు చేపట్టిన తీరు, 2004 ఎన్నికల తర్వాత యూపీఏ ప్రభుత్వ ఏర్పాటులో ఆమె పోషించిన పాత్ర వంటి రాజకీయ అంశాలనూ ఈ పుస్తకం చర్చించనుంది.

ప్రధాని పదవిని తిరస్కరించిన ఘటన

2004 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యూపీఏ) విజయం సాధించిన తర్వాత సోనియా గాంధీ ప్రధానమంత్రి పదవిని స్వీకరించకపోవడం ఆమె రాజకీయ జీవితంలో కీలక ఘట్టంగా నిలిచింది. ఆమె స్థానంలో మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. తాజాగా రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి కావాలన్న నిర్ణయాన్ని తాను వ్యతిరేకించినట్లు సోనియా గాంధీ వెల్లడించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. రాజకీయ అధికారానికి సంబంధించి గాంధీ కుటుంబం ఎదుర్కొన్న నిర్ణయాలు, వ్యక్తిగత సంఘర్షణలపై ఆమె దృక్పథాన్ని ఈ ఆత్మకథ మరింత స్పష్టం చేసే అవకాశం ఉంది.

హైసెక్యూరిటీ జైలు బ్లాక్‌లోకి గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్..!



న్యూఢిల్లీ:అక్టోబర్ 27(మహా ప్రభ)

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ పై కాల్పుల ఘటన నేపథ్యంలో ఆ దాడి వెనుక గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ఉన్నారనే వార్తలు జోరందుకున్నాయి. కొన్నేళ్లుగా అతడు జైల్లోనే ఉన్నప్పటికీ బయట అతడి అనుచరులు సాగిస్తున్న నేర కార్యకలాపాలు కలకలం సృష్టిస్తున్నాయి. ఈ క్రమంలో అతడిపై దాడి జరగవచ్చుననే అనుమానంతో అధికారులు అతడిని మరింత కట్టుదిట్టమైన భద్రత ఉండే జైలుగది కి మార్చినట్లు తెలుస్తున్నది.ప్రస్తుతం లారెన్స్ బిష్ణోయ్ గుజరాత్‌లోని సబర్మతి సెంట్రల్ జైలులో ఉన్నాడు. మొన్నటివరకు '10-సెల్' బ్లాక్‌లో ఉన్న అతడిని ఇప్పుడు హైసెక్యూరిటీ ఉండే '200 బ్లాక్' కు మార్చినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ బ్లాక్‌ను మొత్తం నాలుగు భాగాలుగా విభజించారు. ఒక్కో సెక్షన్‌లో 50 మంది ఖైదీల చొప్పున మొత్తం 200 మంది ఉంటారు. ఒక్కో సెల్ 7.5ఐ11 అడుగుల పరిమాణంలో ఉంటుంది. ఖైదీల మధ్య ఎలాంటి సంభాషణ జరగకుండా ఇక్కడ నిరంతర నిఘా పెట్టారు. 2008 బాంబు పేలుళ్ల దోషులు కూడా ఇదే బ్లాక్‌లో శిక్ష అనుభవిస్తున్నారు. ఇప్పుడు లారెన్స్ బిష్ణోయ్‌ను కూడా 200 బ్లాక్‌లోని గదికి మార్చారు. పంజాబ్‌కు చెందిన లారెన్స్ బిష్ణోయ్ 2010-12 నుంచి నేర కార్యకలాపాలకు పాల్పడుతున్నాడు. హత్యలు, దోపిడీ వంటి నేరాల్లో అతడిపై పలు కేసులు నమోదయ్యాయి. 2014లో అక్రమాయుధాల కేసులో అరెస్టయ్యాడు. పంజాబ్‌లోని కొన్ని జైళ్లతోపాటు ఢిల్లీలోని తిహార్ జైలులో అతడిని కొంతకాలం నిర్బంధించారు. అయితే జైల్లో నుంచే అతడు నేర కార్యకలాపాలను సాగించాడు. జైలు ఫోన్ నుంచే దోపిడీ కోసం బెదిరింపు ఫోన్ కాల్స్ చేయడం, తన నెట్‌వర్క్‌కు ఆడియో, వీడియో సందేశాలు పంపడం లాంటివి చేసినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఓసారి కస్టడీలో ఉండగానే అతడు మీడియాకు ఇంటర్వ్యూ ఇవ్వడం కూడా వివాదాస్పదమైంది. ఆ తర్వాత మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన కేసులో లారెన్స్ బిష్ణోయ్‌ను గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ 2023లో అదుపులోకి తీసుకుని సబర్మతి సెంట్రల్ జైలుకు తరలించింది. అప్పటి నుంచి ఇదే జైల్లో ఉన్నాడు. అయితే గత రెండేళ్లుగా అతడు బయటి వ్యక్తులకు ఫోన్ చేయడం గానీ, నేరుగా సంభాషించిన సందర్భాలు లేవని దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. కేవలం న్యాయ బృందంతో మాత్రమే మాట్లాడినట్లు తెలిపారు. కోర్టు విచారణలకూ వర్చువల్‌గానే హాజరైనట్లు వెల్లడించారు. అయినప్పటికీ లారెన్స్ బిష్ణోయ్ పేరుతో నేర కార్యకలాపాలు కొనసాగుతుండటం గమనార్హం. లారెన్స్ స్నేహితుడైన మరో గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్, రోహిత్ గొదారా వంటి వారు విదేశాల్లో ఉంటూ ఈ నేరాలకు కుట్రలు చేస్తున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. వారి ఆటకట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

పది లక్షల మందితో నిరసనకు దిగితే వ్యాపారాలు ఎలా సాగించాలి?


- రాహుల్‌గాంధీకి ఢిల్లీ వ్యాపార సంఘాల మరో లేఖ



న్యూఢిల్లీ, నేషనల్ బ్యూరో: అక్టోబర్ 27(మహా ప్రభ)

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలనే డిమాండ్‌తో నవంబర్ 1న కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన భారీ నిరసన ర్యాలీపై ఢిల్లీ వ్యాపార సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీపావళి పండుగ వ్యాపారాలు జోరుగా సాగే సమయంలో పది లక్షల మందితో నిరసన చేపడితే తాము వ్యాపారాలు ఎలా నిర్వహించుకోవాలని ప్రశ్నిస్తున్నాయి. ర్యాలీని వాయిదా వేయాలని ఇప్పటికే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి లేఖ రాసిన ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ), స్పందన లేకపోవడంతో మరోసారి లేఖ రాసింది. నవంబర్ 1న రామ్‌లీలా మైదానం పరిసరాల్లో భారీ ర్యాలీ నిర్వహిస్తే సుమారు రూ.10 వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేసింది. ర్యాలీని నవంబర్ 10కి వాయిదా వేయాలని, అది సాధ్యం కాకపోతే ప్రధాన వాణిజ్య ప్రాంతాలకు దూరంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది. సీటీఐ చైర్మన్ బ్రిజేశ్ గోయల్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీతోపాటు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు కూడా లేఖ ప్రతులను పంపినట్లు తెలిపారు. ఈ అంశంపై ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు. అక్టోబర్ 31, నవంబర్ 1 తేదీల్లో రామ్‌లీలా మైదానం పరిసరాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయడం, రహదారులను మూసివేయడం వంటి చర్యలతో వినియోగదారులు మార్కెట్లకు చేరుకోవడం కష్టమవుతుందని పేర్కొన్నారు. ఢిల్లీలోని ఇరుకైన వీధుల్లోకి లక్షలాది మంది నిరసనకారులతోపాటు దాదాపు 20 వేల వాహనాలు ప్రవేశిస్తే రాకపోకలు స్తంభించే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్టోబర్ 10న జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో సుమారు నాలుగు వేల మంది పాల్గొనడంతోనే ఢిల్లీలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని గుర్తుచేశారు. ఆ నిరసనల కారణంగా వ్యాపారులకు దాదాపు రూ.3 వేల కోట్ల నష్టం వాటిల్లిందని ఆయన పేర్కొన్నారు. పండుగ సీజన్‌లో వ్యాపారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ నాయకత్వం ర్యాలీ తేదీ లేదా వేదికను మార్చాలని మరోసారి విజ్ఞప్తి చేశారు.

బ్రిటన్‌లో కారు రేస్..
ఇద్దరు భారత సంతతి వ్యక్తులకు 28 ఏళ్ల జైలుశిక్ష



లండన్ న్యూఢిల్లీ:అక్టోబర్ 27(మహా ప్రభ)

బ్రిటన్‌లో కారు రేస్ లో పాల్గొని తల్లీకూతుళ్ల మృతికి కారణమైన ఇద్దరు భారతీయ సంతతి వ్యక్తులకు జైలుశిక్ష పడింది. ఆ ఇద్దరికీ కలిపి 28 ఏళ్ల జైలుశిక్ష విధించారు. 2023 జనవరిలో రోడ్డు ప్రమాద ఘటన జరిగింది. ఈ కేసులో జాస్‌కమల్ రియాత్, హర్దీప్ బాచూకు జైలుశిక్ష పడింది. రియాత్ వయసు 37 ఏళ్లు, హర్దీప్ 29 ఉన్నాడు. బాచూకు చెందిన ఆడీ టీటీ ఆర్ఎస్ కారు ఢీకొనడంతో స్కూల్‌కు వెళ్తున్న తల్లీకూతుళ్లు మృతిచెందారు. బాచూతో కలిసి రియాత్ కారు రేసులో పాల్గొన్నట్లు సీసీటీవీ ఫూటేజ్ ద్వారా తెలిసింది. రియాత్ బీఎండబ్ల్యూ ఎం135ఐ కారులో రేస్ చేశాడు.నేరాన్ని అంగీకరించిన బాచూకు 12 ఏళ్ల జైలుశిక్ష పడింది. కానీ తన తప్పు లేదని వాదించిన రియాత్‌కు 16 ఏళ్ల జైలుశిక్ష విధించారు. ఇద్దరికీ ఆరేళ్ల పాటు డ్రైవింగ్ నిషేధించారు. రోడ్డు అనేది రేస్ ట్రాక్ కాదు అని, ప్రజా రవాణా రోడ్డుపై శక్తివంతమైన కార్లను పరీక్షించడం సరికాదు అని జడ్జీ రే సింగ్ తన తీర్పు సమయంలో పేర్కొన్నారు. పోటీపడి అతివేగంగా వాహనాన్ని నడపడం వల్ల ప్రాణ నష్టం జరిగినట్లు జడ్జీ తెలిపారు. అయితే రేస్ జరగడానికి ముందు ఇద్దరికీ పరిచయం లేదని, ఓ ట్రాఫిక్ లైట్ దగ్గర ఆగిన సమయంలో కార్లు పక్కపక్కనే ఆగడం వల్ల ఇద్దరు పరిచయం చేసుకున్నారని, ఇక వాళ్ల కార్ల సత్తాను పరీక్షించుకునేందుకు రోడ్డు రేస్ చేశారని విచారణలో తేల్చారు. బాచూ డాష్‌కామ్ ఫూటేజ్, రియాత్ ఫోన్ ఆధారంగా కూడా ఈ కన్ఫర్మేషన్ చేశారు.

ప్రాపర్టీపై వివాదం..
హోటల్‌లో అయిదుగురి కాల్చివేత



గౌహతి:అక్టోబర్ 27(మహా ప్రభ)

అస్సాంలోని గౌహతి లో దారుణం జరిగింది. ఓ హోటల్‌లో అయిదురు కాల్చివేతకు గురయ్యారు. ప్రాపర్టీ ఓనర్, లీజ్‌హోల్డర్ మధ్య ఘర్షణ జరిగినట్లు తెలుస్తోంది. హోటల్ బిలాస్ ఇన్‌లో రాత్రి 9 గంటలకు కాల్పులు జరిగాయి. అస్సాం పోలీసు ప్రధాన కార్యాలయానికి 2 కిలోమీటర్ల దూరంలో జరిగింది. ఆరుగురికి బుల్లెట్ గాయాలు కాగా, దాంట్లో అయిదుగురు మృతిచెందినట్లు పోలీసు కమీషనర్ పార్థసారథ మహంత తెలిపారు. నిందితుడిని గణకంట గగోయ్‌గా గుర్తించారు. ప్రాపర్టీ లీజ్‌హోల్డర్ అతను. ఘటన జరిగిన గంటలోనే అతన్ని పల్టన్ బజార్ ఏరియాలో అదుపులోకి తీసుకున్నారు. .32 బోర్ లైసెన్స్ పిస్తోల్‌ను వాడారు. దాన్ని సీజ్ చేశారు. కేసులో దర్యాప్తు జరుగుతున్నది. హోటల్ లీజు అగ్రిమెంట్ అంశంలో గొడవ జరిగిందని, ప్రాపర్టీ వివాదం నేపథ్యంలో ఫైరింగ్ జరిగినట్లు మహంత్ తెలిపారు. మృతిచెందిన అయిదుగురు వ్యక్తులు హోటల్ ఓనర్‌కు సంబంధితులే. దాంట్లో నలుగురు ఒకే కుటుంబసభ్యులు. ఏడాది క్రితం గగోయ్ హోటల్‌ను లీజుకు తీసుకున్నాడు.

వివాహితపై సామూహిక లైంగిక దాడి

ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు



సైదాబాద్, అక్టోబర్ 27(మహా ప్రభ)

వివాహితపై ముగ్గురు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డ ఘటన కాంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ బాలరాజు వివరాల ప్రకారం.. బంగ్లాదేశ్‌కు చెందిన ఫయాజ్‌కు మయన్మార్‌కు చెందిన మహిళతో కొంత కాలం క్రితం వివాహమైంది. ఫయాజ్ దంపతులు కాంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రోషన్ దౌలా ప్రాంతంలోని డైమండ్ హోటల్ సమీపంలో నివాసముంటున్నారు. ఫయాజ్ స్నేహితులు మయన్మార్‌కు చెందిన కమల్, ముజీబ్ , రెహ్మాన్ అలియాస్ ఇబ్రహీం అదే ప్రాంతంలో నివాసముంటున్నారు. కాగా ఇంటి వద్ద ఫయాజ్ భార్య ఒంటరిగా ఉన్న సమయంలో ముగ్గురు వ్యక్తులు చొరబడి సామూహిక లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలు తమ సమీప బంధువుతో చెప్పింది.బాధితురాలితో కలిసి వారు కాంచన్‌బాగ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు బాధితురాలిని భరోసా సెంటర్‌కు తరలించి విచారించి వివరాలను సేకరించారు. బాధితురాలిపై లైంగిక దాడి జరిగినప్పటి నుంచి భర్త ఫయాజ్ పరారీలో ఉండటంతో పోలీసులకు అనుమానం రావడంతో అతడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. నిందితులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ బాలరాజు తెలిపారు.

సమ్మిట్‌ను సక్సెస్ చేద్దాం

మొదటి తరువాయి

నవంబర్ మొదటి వారంలోగా ప్రణాళికలను ఖరారు చేసుకుని, పలు దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చే సీఈవోలు, ప్రతినిధులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. టెక్నాలజీ, ఫార్మా, ఏరోస్పేస్ తదితర రంగాల్లో గొప్ప విజయాలు సాధించిన వివిధ ప్రముఖులను అతిథులకు తెలియజేసేలా హైదరాబాద్ నగరవ్యాప్తంగా ప్రచార ఏర్పాట్లు చేశారు. నగరంలో పలు చోట్ల డ్రోన్ ఆధారిత ప్రచారం చేపట్టాలని పేర్కొన్నారు. క్లైమేట్ చేంజ్, ఏఐ రంగాలకు సంబంధించిన ప్రపంచ స్థాయి ప్రముఖులను గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానించాలని తెలిపారు. ఏవిజిసి (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్) రంగానికి సంబంధించి ప్రత్యేకంగా చేస్తున్న ఏర్పాట్ల గురించి అధికారులు వివరించారు. తెలంగాణ సాంప్రదాయాలు ప్రతిబింబించేలా గ్లోబల్ సమ్మిట్ ఆవరణలో డిజైన్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఎం అధికారులు లకు సూచించారు. కాకతీయ కళా తోరణం, రామప్ప ఆలయం డిజైన్లకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. బతుకమ్మ పండుగ గురించి అతిథులు తెలుసుకునేలా ప్రత్యేకంగా చేస్తున్న డిజైన్లు, ఏర్పాట్లపై అధికారులు వివరించారు. ఈ సమావేశంలో సీఎస్ సంజయ్ జా?, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో బి. అజిత్ రెడ్డి, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ డి. అనుదీప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దాడులు ఆపితే ఒక బిలియన్ డాలర్లు ఇస్తాం..

- హౌతీలకు సౌదీ భారీ ఆఫర్..!

న్యూఢిల్లీ:



: సౌదీ అరేబియా హౌతీ తిరుగుబాటుదారుల మధ్య దాడులతో పశ్చిమాసియా లో ఘర్షణలు తీవ్రస్థాయికి చేరాయి. సౌదీలోని మౌలిక సదుపాయాలు, చమురు క్షేత్రాలను హౌతీలు డ్రోన్‌లు, క్షిపణులతో టార్గెట్ చేస్తుండటంతో సంపన్న దేశం తీవ్ర ఆర్థిక, ప్రాణ నష్టాలను చవిచూస్తున్నది. హర్మూజ్ జలసంధి లో ట్యాంకర్లపై ఇరాన్ చేస్తున్న దాడులవల్ల గల్ఫ్ దేశాల నుంచి చమురు ఎగుమతులకు కూడా అంతరాయం కలుగుతున్నది.దేశంలోని విమానాశ్రయాలు, చమురు కేంద్రాలపై దాడులు మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఎట్టకేలకు హౌతీలతో రాజీకొచ్చారు. కాల్పుల విరమణ కోసం ఇరాన్ మధ్యవర్తిత్వంతో తిరుగుబాటుదారులకు ఓ ఆఫర్ ఇచ్చారు. హౌతీలు తమ దేశంపై దాడులను పూర్తిగా ఆపితే 1 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.9,500 కోట్లు) ఇస్తామని సౌదీ యువరాజు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మొత్తాన్ని ఇరాన్ ద్వారానే హౌతీలకు అందించే అవకాశం ఉంది. ఈ మేరకు ఇజ్రాయెల్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ ఒప్పందం కోసమే ఇటీవల సౌదీ రక్షణ మంత్రి ప్రిన్స్ ఖలీద్ బిన్ సల్మాన్ టెహ్రాన్‌కు వెళ్లినట్లు సమాచారం. ఆయన వచ్చిన సైనిక రవాణా విమానంలోనే హౌతీలకు ఇవ్వదలిచిన మొత్తం డబ్బును తీసుకువచ్చినట్లు తెలుస్తున్నది. అయితే ఈ విషయాన్ని సౌదీ అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. ఇరాన్ మధ్యవర్తిత్వంతో జరిగిన శాంతి చర్చల్లో టర్కీ ఇంటెలిజెన్స్ చీఫ్, పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్, ఐఆర్‌జీసీ సీనియర్ అధికారులు పాల్గొన్నట్లు తెలిసింది. గతంలో హూతీలు యెమెన్ సర్కారుతో పోరాడుతున్న సందర్భంలో వ్యతిరేకంగా సౌదీ అరేబియా ప్రత్యక్షంగా రంగంలోకి దిగింది. ఇక అప్పటి నుంచి వీరి మధ్య ప్రత్యక్ష పోరు జరుగుతోంది. ఈ క్రమంలోనే సౌదీ వారితో ఒప్పందం కుదుర్చుకోవడానికి ముందుకు వచ్చింది.

వచ్చే ఎన్నికల్లో వంద సీట్లే మా లక్ష్యం!

మొదటి తరువాయి



లభిస్తుందని మహేష్‌కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. నవంబర్ తర్వాత పార్టీ ఎన్నికల సన్నద్ధతపై మరింత దృష్టి సారిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ వ్యవహారాల్లో తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని, ప్రభుత్వానికి, పార్టీకి మధ్య సమన్వయం కొనసాగుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తమకు ప్రధాన బలమని మహేష్‌కుమార్ గౌడ్ అభిప్రాయపడ్డారు. ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలతో ప్రజలకు ప్రయోజనం చేకూరుతోందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో 90 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతుగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా పార్టీ శాశ్వతంగా ఉంటుందని, కాంగ్రెస్ సంస్థాగతంగా బలంగా ఉందని వ్యాఖ్యానించారు. మరోవైపు బీఆర్ఎస్ నాయకులపై మహేష్‌కుమార్ గౌడ్ విమర్శలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పుల భారంలో చిక్కుకుందని ఆరోపించారు. కేటీఆర్, హరీశ్‌రావు ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న పరిస్థితుల విషయంలోనూ హరీశ్‌రావు వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. తెలంగాణలో బీజేపీ రాజకీయ భవిష్యత్తుపైనా ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు. రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉన్న ఎనిమిది మంది బీజేపీ ఎంపీల్లో వచ్చే ఎన్నికల్లో ఇద్దరు గెలిచినా ఎక్కువేనని, ఆ పార్టీ ఎమ్మెల్యేలు తిరిగి గెలవడం కష్టమని తాను భావిస్తున్నట్లు చెప్పారు. ఆదిలాబాద్, నిజామాబాద్ ప్రాంతాల్లో కాంగ్రెస్ 40 శాతం స్థానాలను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులను మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్తామని మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు.

అభిషేక్ శతక విధ్వంసం.

- మూడో టీ20లో న్యూజిలాండ్‌పై భారత్ ఆరు వికెట్ల తేడాతో విజయం

- ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 3--0 ఆధిక్యంతో సిరీస్ కైవసం

- 38 బంతుల్లో 113 పరుగులతో చెలరేగిన అభిషేక్ శర్మ

- కేవలం 35 బంతుల్లోనే శతకం పూర్తి చేసిన భారత ఓపెనర్

- వైభవ్ సూర్యవంశీ 45 పరుగులు.. తొలి వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యం

- పవర్‌ప్లేలో 118 పరుగులు సాధించిన భారత బ్యాటర్లు

- 13.2 ఓవర్లలోనే 199 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన భారత్

- కివీస్ తరఫున డారిల్ మిచెల్ 89 పరుగులతో పోరాటం



వెల్లింగ్టన్:

న్యూజిలాండ్‌తో జరిగిన మూడవ టీ20 మ్యాచ్ లో ఇండియా 6 వికెట్ల తేడాతో నెగ్గింది.కివీస్ విసిరిన 199 పరుగుల లక్ష్యాన్ని కేవలం 13.2 ఓవర్లలో అందుకున్నది. దీంతో 5 మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 3–0 ఆధిక్యాన్ని సాధించి సిరీస్‌ను వశం చేసుకున్నది. ఓపెనర్ అభిషేక్ శర్మ సూపర్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఫోర్లు, సిక్సర్లతో చెలరేగిన అతను కేవలం 35 బంతుల్లో సెంచరీ కొట్టాడు. అభిషేక్ 38 బంతుల్లో 113 రన్స్ చేసి ఔటయ్యాడు. ఛేజింగ్‌లో ఇండియన్ ఓపెనర్లు చెలరేగిపోయారు. వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ ఇద్దరూ తొలి వికెట్‌కు రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ ఇద్దరూ తొలి వికెట్‌కు 133 రన్స్ జోడించారు. వైభవ్ 45 రన్స్ చేసి ఔటయ్యాడు. అయితే పవర్ ప్లేలో ఇండియా కొత్త రికార్డు క్రియేట్ చేసింది. 6 ఓవర్లలోనే భారత ఓపెనర్లు 118 రన్స్ చేశారు. కివీస్ బౌలర్లు ఏ దశలోనూ తమ ప్రభావాన్ని చూపలేకపోయారు. అభిషేక్, వైభవ్ ఆడుతున్న తీరు.. కివీస్ బౌలర్లలో దడపుట్టించింది. ఇండియా కేవలం 4 వికెట్లు కోల్పోయి టార్గెట్ చేరుకున్నది. కివీస్ బౌలర్లలో జేమీసన్ రెండు వికెట్లు తీసుకున్నాడు.తొలుత ఫస్ట్ బ్యాటింగ్ చేసిన కివీస్ నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 రన్స్ చేసింది. డారెల్ మిచెల్ డాషింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. అతను 52 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 89 రన్స్ చేశాడు. కివీస్ ఇన్నింగ్స్‌లో ఫిన్ అలెన్ 40, గ్లెన్ ఫిలిప్స్ 17, బెవాన్ జాకబ్స్ 39 రన్స్ చేశారు. జాకబ్స్ 23 బంతుల్లో 4 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 39 రన్స్ చేశాడు. నాలుగో వికెట్ జాకబ్స్, మిచెల్ అజేయంగా 75 రన్స్ జోడించారు. ఆ ఇద్దరూ నాటౌట్‌గా నిలిచారు. భారత బౌలర్లలో నితీశ్, అక్షర్, అర్షదీప్ చెరో వికెట్ తీసుకున్నారు.

రూట్ మార్చిన కాంగ్రెస్!

- 'చలో ఢిల్లీ'కి ప్రత్యేక రైళ్లకు కేంద్రప్రభుత్వం నిరాకరణ

- స్లీపర్ బస్సుల్లో హస్తినకు వెళ్లాలని నేతల నిర్ణయం



తెలంగాణ బ్యూరో:

ఢిల్లీ వేదికగా నరేంద్రమోదీ సర్కారు ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు కాంగ్రెస్ పార్టీ నవంబర్ 1న తలపెట్టిన 'ఓట్ బచావో.. దేశ్ బచావో' ర్యాలియై బీజేపీ ప్రభుత్వం ముందే అడ్డుకోవాలని భావించిందా? తెలంగాణ నుంచి తరలివచ్చే భారీ జన సందోహాన్ని చూసి కమలనాథుల్లో వణుకు మొదలైందంటే గాంధీభవన్ వర్గాలు అవుననే చెబుతున్నాయి. నవంబర్ 1న దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీలా మైదానంలో నిర్వహించనున్న మెగా నేషనల్ ర్యాలియై ఎలాగైనా నీరుగార్చేందుకు కేంద్రం తెరవెనుక తీవ్ర కుట్రలకు తెరలేపిందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. చివరి నిమిషంలో ప్రత్యేక రైళ్లకు అనుమతులు ఇవ్వకుండా నిరాకరించి అడ్డంకులు సృష్టించిందని మండిపడ్డారు. ఇదిలాఉండగా, కేంద్ర ప్రభుత్వం ఎన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించినా ప్రత్యామ్నాయ మార్గంలో దాదాపు 10వేల మంది క్యాడర్‌ను తరలించి తీరుతామని టీపీపీసీ 'ప్లాన్ బీ'తో రచించింది.

రైల్వే అనుమతులు రద్దు

రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి దాదాపు 10వేల మందికి పైగా ముఖ్యనేతలు, కార్యకర్తలను రాంలీలా మైదానానికి తరలించేందుకు కాంగ్రెస్ అధిస్థానం తొలుత ప్రత్యేక రైళ్లను బుక్ చేయాలని నిర్ణయించింది. దీనికోసం రైల్వే నిబంధనల ప్రకారం అన్ని ప్రక్రియలు పూర్తి చేసేందుకు సిద్ధమైన కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన తీవ్రమైన రాజకీయ ఒత్తిళ్లతో రైల్వేశాఖ అనుమతి ఇవ్వడానికి ససేమిరా అంటున్నట్లు కాంగ్రెస్‌నేతలు పేర్కొంటున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి మంగళవారం హుటాహుటినా ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి జిల్లా నుంచి రెండు స్లీపర్ బస్సుల్లో తరలించేలా ఆర్టీసీతో పాటు ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారు. కొందరు నేతలు చావ్మ్యాంగా సికింద్రాబాద్, కాజీపేట, నాంపల్లి స్టేషన్ల నుంచి ఢిల్లీకి నడిచే రెగ్యులర్ సూపర్ ఫాస్ట్ రైళ్లలో (తెలంగాణ, దక్షిణి, రాజధాని, సంపర్క్ క్రాంతి) పెద్దసంఖ్యలో సాధారణ టికెట్లు, బెర్త్‌లను ముందుగానే బుక్ చేసుకున్నారు. దీంతో నాలుగువేల మంది కార్యకర్తలు ఈనెల 29, 30 తేదీల్లో విడతల వారీగా బయలుదేరి వెళ్లనున్నారు. మహారాష్ట్ర సరిహద్దు జిల్లైన ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ శ్రేణులు వందలాది సొంత కార్లు, క్రూయిజ్ వాహనాలతో ఎన్‌హెచ్-44 మీదుగా భారీ కాన్వాయ్‌లుగా తరలేందుకు సమాయత్తమయ్యారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యనేతలు అక్టోబర్ 31 నాటికి విమా?ల్లో నేరుగా ఢిల్లీ చేరుకోనున్నారు. కేంద్రంలో లో బీజేపీ సర్కార్ ఎంతగా అడ్డుకున్నా, రైళ్లను రద్దుచేసినా అంతకు రెట్టింపు కసీతో రాంలీలా మైదానాన్ని కాంగ్రెస్ శ్రేణులతో నింపేస్తామని, కేంద్రానికి ఢిల్లీ వేదికగా గట్టి సమాధానం చెబుతామని అధికారపార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఇంకో ఏడాదే.. ఆ తర్వాత కేసీఆర్ వస్తారు!

మొదటి తరువాయి

ఏమొచ్చింది నిర్మల్‌కు.. అదే కేసీఆర్ ఉన్నప్పుడు నిర్మల్‌కు ఏమొచ్చిందని అడగొచ్చు.. నిర్మల్‌ను జిల్లా చేసిందెవరు.. కేసీఆర్.. నిర్మల్‌లో మెడికల్ కాలేజీ పెట్టిందెవరు.. నర్సింగ్ కాలేజీ పెట్టిందెవరు.. నిర్మల్‌లో అభివృద్ధికి బాటలు వేసిందెవరు.. కేసీఆర్.. నిర్మల్ పట్టణంలోకానీ, తాలూకాలో కానీ నేను స్వయంగా వచ్చి మీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ప్రారంభించిన. నేనొచ్చి మిషన్ భగీరథ ద్వారా మీ ఇంటింటికి తాగునీళ్లిచ్చే కార్యక్రమం మొదలుపెట్టిన. బ్రహ్మాండంగా చెక్‌డ్యామ్‌లు కట్టుకున్నం.. అయిల్ ఫామ్‌లు పెట్టుకున్నమన్నారు. నిర్మల్‌లో బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, ఎంపీ గోడం నగేష్ గెలిచినా నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన ఇంద్రకరణ్ రెడ్డి అధికారం కోల్పోగానే పార్టీని వీడి పారిపోయాడు. అవకాశవాదులు పార్టీని వీడినా, పోరాట యోధులు బీఆర్ఎస్‌లోనే ఉన్నారన్నారు. ఎప్పుడైనా ప్రతీ పార్టీలో రెండు రకాల వ్యక్తులుంటారు.. ఒకటి అవకాశవాదులుంటారు.. రెండోది పోరాటవాదులుంటారు.. ఆయన అవకాశవాదంతో బయటకు పోయినా మేమున్నం అన్నా భయపడకండని పోరాడుతున్న మీ అందరికీ తలవంచి నమస్కారం చేస్తున్నా.. మంచి రోజులు ముందున్నయి. ఇంకో సంవత్సరమే వీళ్ల కథ.. మూడేళ్లయిపోయింది.. సినిమా ఇంటర్వెల్ కూడా పూర్తయిపోయింది. సెకండాఫ్ కూడా చాలా అయింది.. ఇంకా ఎక్కువ టైం కూడా లేదు.. ఇంకో సంవత్సరం మాత్రమే ఉంది.. ఆ తర్వాత కేసీఆర్ వస్తరు.. మనందరికీ మంచి రోజులొస్తయని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

అర్నాబ్..ఉగ్రరూపం..



/హైదరాబాద్:

బంగాళాఖాతంలో భయం రేపుతున్న 'అర్నాబ్' తుపాను ముప్పుతో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. గంటకు 25 కిలోమీటర్ల వేగంతో కదులుతున్న ఈ అతి తీవ్ర తుపాను విశాఖపట్నం, బాపట్ల మధ్య యానాం దగ్గర బుధవారం ఉదయం తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలతోపాటు బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. తుపాను కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారడంతో ప్రాణ నష్టం జరగకుండా చూడటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం నుంచి కోస్తా తీర ప్రాంత రహదారులతో పాటు బీచ్‌లను పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రకటించింది. విశాఖలోని రుషి కొండ, ఆర్కే బీచ్‌లతో పాటు బాపట్ల జిల్లాలోని సూర్యలంక, చీరాల, ఊటేపు, రామపురం, పొట్టిసుబ్బయ్యపాలెం బీచ్‌ల వద్ద గస్తీ ఏర్పాటు చేశారు. పర్యాటకులు ఎవరూ రావద్దని సూచించారు. అధికారిక ఉత్తర్వులు వెలువడే వరకు బీచ్‌లలో ఆంక్షలు కొనసాగుతాయని తెలిపారు. తుపాను ప్రభావంతో వైజాగ్‌లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తోంది. తుపాను అతి తీవ్రంగా మారడంతో 11 జిల్లాలకు ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను హుటాహుటిన తరలించారు. 16 జిల్లాల్లోని 2,460 గ్రామాలు, 92 పట్టణ ప్రాంతాలపై తుపాను ప్రభావం తీవ్రంగా పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రక్రియను వేగవంతం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ముప్పు రాకుండా తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని విద్యా సంస్థలకు ఇప్పటికే సెలవులు ప్రకటించారు. మరోవైపు సముద్రం తీవ్రరూపం దాల్చింది. ఉప్పొంద లాంటి చోట్ల రాళ్లగట్లను సైతం దాటుకుని అలలు రోడ్లపైకి దూసుకొస్తుండటంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. సముద్రంలో వేటను పూర్తిగా నిషేధించి, సుమారు 30 వేల మత్స్యకారుల పడవలను సురక్షితంగా రేవుల్లో నిలిపివేశారు. బాధితులకు ఆశ్రయం కల్పించేందుకు ప్రభుత్వం 1,763 సహాయక శిబిరాలను సిద్ధం చేసింది. విపత్తు నిర్వహణ కోసం 3,185 మంది నోడల్ ఆఫీసర్లను రంగంలోకి దించింది.

17 మంది ఖైదీలు పరార్

- ఫిట్స్ వచ్చినట్లు నటించి, గార్డులపై దాడి చేసి జంప్

-సిబ్బందిని బంధించి తాళాలు లాక్కున్న ఖైదీలు


-ప్రధాన ద్వారం నుంచి బయటకు పరుగులు

-గార్డు మెడలోని బంగారు గొలుసు కూడా అపహరణ

-పరారైన ఖైదీల కోసం పోలీసుల విస్తృత గాలింపు

-కేరళ సరిహద్దులు, అటవీ ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా

-విధుల్లో నిర్లక్ష్యంపై తొమ్మిది మంది సిబ్బంది సస్పెన్షన్



నేషనల్ బ్యూరో:

తమిళనాడులోని తేని జిల్లా శీలయపట్టి సమీపంలోని తెక్కంపట్టి జిల్లా జైలులో సోమవారం రాత్రి షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. జైలు సిబ్బందిపై దాడి చేసి 17 మంది రిమాండ్ ఖైదీలు పరారయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు 13 మందిని పట్టుకోగా, మిగిలిన నలుగురి కోసం గాలింపులు ముమ్మరం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించారంటూ 9 మంది జైలు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది.

ఫిట్స్ వచ్చినట్లు నటించి..

సోమవారం రాత్రి 10.00 గంటల ప్రాంతంలో జైలులోని 3వ బ్లాక్‌లో ఉన్న ఒక ఖైదీకి ఫిట్స్ (మూర్ఛ వ్యాధి) వచ్చిందని మిగతా ఖైదీలు గట్టిగా కేకలు వేశారు. దీంతో అక్కడ ఉన్న పారా గార్డ్ సెల్వు పరిశీలించడానికి లోపలికి వెళ్లగా, 17 మంది ఖైదీలు ఒక్కసారిగా ఆయనపై దాడి చేసి బంధించారు. అనంతరం ప్రధాన ద్వారం వద్ద ఉన్న మరో ఇద్దరు గార్డులపై దాడి చేసి, వారి వద్ద నుంచి తాళాలు లాక్కుని జైలు బయటకు పరుగులు తీశారు. ఈ క్రమంలో ఓ గార్డ్ మెడలోని 1.2 తులాల బంగారు గొలుసును కూడా ఎత్తుకెళ్లిపోయారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు అప్రమత్తమై గాలింపు చర్యలు చేపట్టారు. ఓ దివ్యాంగుడు సహా ఐదుగురిని అరెస్ట్ చేశారు. మిగిలిన 12 మంది ఖైదీల కోసం కేరళ సరిహద్దు ప్రాంతాలతో పాటు బస్టాండ్లలో తీవ్రంగా తనిఖీలు చేస్తున్నారు. అలాగే అడవి ప్రాంతాల్లో దాక్కున్న ఖైదీలను గుర్తించేందుకు డ్రోన్ కెమెరాలను ఉపయోగిస్తున్నారు. ఘటన స్థలాన్ని ప్రిజన్స్ డీజీపీ సందీప్ రాయ్ రాథోడ్, సౌత్ జోన్ ఐజీ విజయేంద్ర బిదరి సందర్శించి విచారణ చేపట్టారు.

ఓటు పరిరక్షణ ఉద్యమం కొనసాగిస్తాం

న్యూఢిల్లీ:

దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల ఓటు హక్కును హరిస్తున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. పేదల పేర్లను ఉద్దేశపూర్వకంగా ఓట్ల జాబితాల నుంచి తొలగిస్తున్నారని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు లేదా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనను పదవి నుంచి తొలగించే వరకు ప్రతిపక్షాల ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఢిల్లీలోని త్రిలోక్‌పురిలో మంగళవారం నిర్వహించిన ఓటు హక్కు.. జీవించే హక్కు పేరుతో జరిగిన ప్రజా విచారణ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడారు. ప్రతి భారత పౌరుడికి ఓటు హక్కు ప్రాథమిక హక్కు అని, అయితే ఆ హక్కును క్రమపద్ధతిలో దూరం చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా పేదల పేర్లను ఓట్ల జాబితాల నుంచి తొలగించడం వల్ల వారు తమ ప్రజాస్వామ్య హక్కులతో పాటు ఇతర ప్రభుత్వ ప్రయోజనాలను పొందే అవకాశాలను కూడా కోల్పోతున్నారని పేర్కొన్నారు. దేశంలోని కొద్దిమంది సంపన్నుల ప్రయోజనాల కోసమే పాలన సాగించే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు.

కేంద్రీయ విద్యాలయం ద్వారా వనపర్తి విద్యార్థులకు జాతీయ స్థాయి విద్య!!

-వనపర్తి లోని నాగవరం శివార్ కేంద్రీయ విద్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించిన ఎంపీ మల్లురవి!!

-త్వరలో కేంద్రీయ విద్యాలయానికి సొంత భవనం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు!!

-వనపర్తిలో ఎంపీ మల్లు రవి సహకారంతో రూ.9 కోట్ల విలువైన సీఎస్ఆర్ నిధుల ద్వారా పలు అభివృద్ధి పనులు

-ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి





వనపర్తి అక్టోబర్ 27 మహాప్రభ

వనపర్తి జిల్లా నాగవరం శివారులో ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయాన్ని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి సోమవారం రాత్రి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు. ఇప్పటికే నాలుగు నెలల క్రితం ప్రారంభమైన ఈ విద్యాలయానికి నేడు అధికారిక ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ విద్యాలయంలోని తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, పాఠశాల నిర్వహణ, ప్రవేశాల ప్రక్రియ, బోధనా విధానం, విద్యా ప్రమాణాల గురించి ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఎంపీ మాట్లాడుతూ వనపర్తి జిల్లాకు కేంద్రీయ విద్యాలయం మంజూరు కావడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. అతి తక్కువ సమయంలోనే విద్యాలయాన్ని ప్రారంభించి విద్యార్థులకు విద్యను అందుబాటులోకి తీసుకురావడం ఆనందంగా ఉందని తెలిపారు. విద్యాలయం నిర్వహణ కోసం జిల్లా కలెక్టర్ అనువైన భవనాన్ని కేటాయించారని పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు దేశవ్యాప్తంగా అమలవుతున్న ప్రమాణాలకు అనుగుణంగా విద్యాబోధన అందుతుందని చెప్పారు విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ వనపర్తి జిల్లాకు కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయించేందుకు ఎంతో కృషి చేశామని తెలిపారు. ఎంపీ మల్లు రవి ఢిల్లీలో సంబంధిత స్థాయిలో నిరంతరం ప్రయత్నాలు చేయడం వల్ల ఈ విద్యాలయం ఏర్పాటు సాధ్యమైందని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రవేశాల ప్రక్రియ పూర్తిచేసుకొని విద్యాలయం విజయవంతంగా కొనసాగుతోందని అన్నారు. త్వరలో కేంద్రీయ విద్యాలయానికి సొంత భవనం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. అదేవిధంగా వనపర్తిలో ఎంపీ మల్లు రవి సహకారంతో రూ.9 కోట్ల విలువైన సీఎస్ఆర్ నిధుల ద్వారా విద్యాలయానికి అవసరమైన పలు సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. వనపర్తి జిల్లాలో నవోదయ విద్యాలయం ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు పంపించామని, ఇందుకోసం అనువైన భూమిని ఇప్పటికే పరిశీలించామని తెలిపారు.

జిల్లాలో విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయం భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతిష్టాత్మక విద్యాసంస్థ అని తెలిపారు. విద్యాలయం మంజూరుకు అవసరమైన అన్ని ప్రమాణాలను పరిశీలించిన అనంతరమే అనుమతులు లభిస్తాయని వివరించారు. వనపర్తి లో అందుకు తగ్గ ప్రమాణాలను మనం చూపించడంలో సఫలమయ్యామని అందుకే ఏర్పాటు సాధ్యమైందని తెలిపారు. వనపర్తి జిల్లాకు కేంద్రీయ విద్యాలయం తీసుకురావడంలో ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఎంతో సహకరించారని అన్నారు. విద్యాలయంలో ప్రవేశాల కోసం అధిక సంఖ్యలో దరఖాస్తులు రావడంతో నిబంధనల ప్రకారం లక్కీ డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవడంతో పాటు ఈ విద్యాసంస్థకు, వనపర్తి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మాజీ డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిర్లక్ష్యంతోనే తెలంగాణలో కరువు పరిస్థితులు

-పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అర్హులైన ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలి

-మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్





దేవరకొండ అక్టోబర్ 27(మహా ప్రభ)

కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకాక, ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో చేతులెత్తేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ లు విమర్శించారు.మంగళవారం దేవరకొండ పట్టణంలోని సాయిశివ గార్డెన్ లో జరిగిన దేవరకొండ నియోజకవర్గంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన ఓటరు నమోదు సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ..... ముఖ్యమంత్రి,మంత్రులు ప్రజా సమస్యలను పరిష్కరించడంపై కాకుండా స్కామ్‌లు, వాటాల కోసమే పనిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, పట్టభద్రుల ఓటరు నమోదు ఆవశ్యకతపై మాట్లాడారు.కృష్ణా నది నుంచి ఇప్పటివరకు తెలంగాణకు అందుబాటులో ఉన్న నీటిలో 18 టీఎంసీల నీటిని కూడా వినియోగించుకోలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ప్రారంభించి ఉంటే రాష్ట్రంలోని చెరువులు నిండి, ప్రాజెక్టులన్నీ నీటితో కళకళలాడేవని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు.కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కె.ఎల్.ఐ) ద్వారా డిండి ప్రాజెక్టును రెండుసార్లు నింపిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. గతంలో నీటి వనరుల వినియోగానికి ప్రాధాన్యత ఇచ్చి రైతులకు సాగునీరు అందించామని తెలిపారు. ప్రస్తుతం నీటి నిర్వహణలో వైఫల్యం కారణంగా తెలంగాణ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.నాగార్జునసాగర్‌కు నీరు రాకుండా పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలించే అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు వద్ద లొంగిపోయి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర రైతుల ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును మరింత బలోపేతం చేసుకోవాలంటే పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొనేలా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పట్టభద్రుల హక్కుల పరిరక్షణలో ఓటరు నమోదు కీలకమని, అర్హులైన వారెవరూ ఈ అవకాశాన్ని కోల్పోకుండా చూడాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశం ద్వారా దేవరకొండ నియోజకవర్గంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు. ఈ సమావేశంలో బిఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, చింతల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాలికను మాయమాటలతో తీసుకెళ్లిన
కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

-రూ.30 వేల జరిమానా విధించిన ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు

-నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించిన మెదక్ జిల్లా ఎస్పీ, డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్



మెదక్ అక్టోబర్ 27,(మహాప్రభ)

బాలికను మాయమాటలతో నమ్మించి వెంట తీసుకెళ్లిన కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 30 వేల జరిమానా విధిస్తూ మెదక్ జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. 8వ తరగతి చదువుతున్న బాలికను ఆమె తండ్రి 14-10-2025న హాస్టల్‌కు వెళ్లేందుకు బస్సు ఎక్కించారు. అయితే, వడియారం వద్ద బస్సు ఆగకపోవడంతో బాలిక చేగుంటలో దిగింది. ఈ క్రమంలో తనకు పరిచయమున్న ఆనంద్ (22) అనే యువకుడికి ఫోన్ చేసి, తాను చేగుంటలో ఉన్నానని, తనను హాస్టల్ వద్ద దింపాలని కోరింది. అక్కడికి చేరుకున్న ఆనంద్ మాయమాటలు చెప్పి, తనతో ఉంటే బాగా చూసుకుంటానని నమ్మించి బాలికను వెంట తీసుకెళ్లాడు. మొదట మేడ్చల్‌కు తీసుకెళ్లి అక్కడ కొంతసేపు ఉన్న అనంతరం నిజామాబాద్‌కు వెళ్లారు. మరుసటి రోజు ఉదయం సికింద్రాబాద్‌కు చేరుకుని, అక్కడి నుంచి ఆనంద్ తన పిన్ని ఇంటికి బాలికను తీసుకెళ్లాడు. అయితే, బాలికను ఇంటికి వెళ్లాలని ఆనంద్ తల్లి సూచించడంతో అక్టోబర్ 15, 2025 రాత్రి 8 గంటల సమయంలో బస్‌స్టాండ్‌కు వెళ్లారు. ఈ క్రమంలో తూప్రాన్ పోలీసు సిబ్బంది బాలికను గుర్తించి భరోసా కేంద్రానికి తరలించారు. ఈ ఘటనపై తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో తొలుత మిస్సింగ్ కేసు నమోదైంది. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తూప్రాన్ పోలీసులు బాలికను గుర్తించి, దర్యాప్తును పకడ్బందీగా పూర్తి చేశారు. కేసు దర్యాప్తు అధికారి ఎస్ఐ ఎన్. జ్యోతి సాక్ష్యాధారాలను సేకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య కోర్టులో బలమైన వాదనలు వినిపించగా, లీగల్ అడ్వైజర్ శ్వేత బాలిక సాక్ష్యం చెప్పేందుకు అవసరమైన సహకారం అందించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన మెదక్ జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభవల్లి నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 30 వేల జరిమానా విధించారు. ఈ కేసులో కోర్టు లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణగౌడ్, సీడీఓ నాగరాజు సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. మహిళలు, చిన్నారుల రక్షణకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, వారిపై నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

దేవరకొండలో బి.ఆర్ ఎస్ ఎం.ఎల్.సి. అభ్యర్థి రాకేష్ రెడ్డి విజయం కోసం కృషి చేయాలి





దేవరకొండ అక్టోబర్ 27(మహా ప్రభ)

దేవరకొండ నియోజకవర్గ బి.ఆర్.ఎస్. పార్టీ ఆధ్వర్యంలో రాబోయే పట్టభద్రుల ఎం.ఎల్.సి. ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించబడింది. మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఉమ్మడి నల్గొండ జిల్లా బి.ఆర్.ఎస్. పార్టీ అధ్యక్షులు రామావత్ రవీంద్ర కుమార్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రివర్యులు సూర్యాపేట శాసనసభ్యులు జగదీశ్వర్ రెడ్డి కీ, ఎం.ఎల్.సి. అభ్యర్థి యువనేత రాకేష్ రెడ్డి కీ బి.ఆర్.ఎస్. పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ మరియు ఇతర ముఖ్య నాయకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఎం.ఎల్.సి. ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ విజయం సాధించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

: నియోజకవర్గంలోని ప్రతి ఓటరును కలిసి బి.ఆర్.ఎస్. పార్టీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, ప్రజా సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటర్ల నమోదు, ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేయాలని రామావత్ రవీంద్ర కుమార్ సూచించారు. ఎం.ఎల్.సి.అభ్యర్థి రాకేష్ రెడ్డి విజయం కోసం క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా కృషి చేయాలని, నియోజకవర్గంలో బి.ఆర్.ఎస్. తిరుగులేని శక్తిగా నిలవాలని నేనావత్ కిషన్ నాయక్ పేర్కొన్నారు. ఈ సన్నాహక సమావేశంలో బి బి.ఆర్.ఎస్.పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యా నాయక్ వడ్త్యా రమేష్ నాయక్ , దేవరకొండ మండల అధ్యక్షులు రెడ్డి పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టభద్రులు బాధ్యతగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

నేనావత్ కిషన్ నాయక్ (బి.ఆర్.ఎస్.పార్టీ రాష్ట్ర నాయకులు)



దేవరకొండ అక్టోబర్ 27(మహా ప్రభ)

-ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పరిధిలోని పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును తప్పక నమోదు చేసుకోవాలని బి.ఆర్.ఎస్.పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ పిలుపునిచ్చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో విద్యావంతుల పాత్ర కీలకమైనదని, ప్రతీ పట్టభద్రుడూ ఓటరుగా నమోదై తమ ప్రజాస్వామ్య బాధ్యతను నెరవేర్చాలని కోరారు. ఓటు నమోదుకు నవంబర్ 06, 2026 చివరి తేదీ అని, గడువు ముగిసేలోగా అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఫ్లెక్సీలు, మాటలు కాదు.. ప్రజలకు అభివృద్ధి కావాలి!

తాడిపర్తి--తాండా, చెన్నూరు రహదారి దుస్థితిపై అఖిలపక్ష ఐక్యవేదిక ఆవేదన



వనపర్తి, అక్టోబర్ 27 మహాప్రభ

ఆకాశమంత ప్రచారం.. అభివృద్ధి సున్న అన్న చందంగా పాలన సాగుతోందని అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు విమర్శించారు. గోపాలపేట నుంచి వస్తుండగా తాడిపర్తి గ్రామం మీదుగా తాండా, చెన్నూరు గ్రామాలకు వెళ్లే రహదారి దుస్థితిని గమనించిన నాయకులు, ప్రయాణికుల ఇబ్బందులపై ఆవేదన వ్యక్తం చేశారు.ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, కోట్లాది రూపాయల నిధులు వచ్చాయని ప్రచారం చేసుకోవడం అభివృద్ధి కాదని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం, సోషల్ మీడియాలో విమర్శకులను కించపరచడం మానుకోవాలని సూచించారు. గ్రామాలకు మెరుగైన రహదారులు, తాగునీరు, నాణ్యమైన విద్య, వైద్యం, అందుబాటులో నిత్యావసరాలు, మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే నిజమైన అభివృద్ధి అని స్పష్టం చేశారు. ప్రజల అవసరాల కోసం నిధులను వినియోగించి, గ్రామీణ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులను అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు, నాయకులు డిమాండ్ చేశారు.

మెదక్ జిల్లాలో ఎండిన వరి పంటలు.. అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి!

-తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా అధ్యక్షులు అక్క మొల్ల మైసయ్య యాదవ్



శివ్వంపేట, అక్టోబర్, 27(మహాప్రభ తెలంగాణ రాష్ట్రంలో మెదక్ జిల్లా జిల్లాలో ఎండిపోయిన వరి పంటలు మండలాలు కరువు మండలాలుగా ప్రకటించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా అధ్యక్షులు అక్క మొల్ల మైసయ్య యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు రాష్ట్రంలో ఏలినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువ పడడంతో మెదక్ జిల్లాలో రైతులు వేసిన పంట వరి చివరి దశలో విద్యుత్తి అంతిరాయం కోతల వల్ల ఎండిపోయిన పంటలు ప్రభుత్వం జిల్లాలో అన్ని మండలాలు సర్వే చేసి ఎండిపోయిన పంటలకు కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు నష్టం పరిహారం ప్రభుత్వం చెల్లించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా అధ్యక్షులు అక్క మొల్ల మైసయ్య యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చి ఆ శాఖల అధికారులను జిల్లాలో అన్ని మండలాలు ఎండిపోయిన పంటలు సర్వే చేసి కరువు మండలాలుగా ప్రకటించి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతుల పక్షాన సంఘం పక్షాన ప్రభుత్వాన్ని మైసయ్య యాదవ్ డిమాండ్ చేశారు రైతులు ఆరు కాలము కష్టపడి అధిక వడ్డీలకు పెట్టుబడి పెట్టి చివరి దశలో కరెంటు కోతల వల్ల ఎండిపోయిన పంటలు రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించి నష్టపరిహారం చెల్లించే బాధ్యత ప్రభుత్వం పైనే ఉందని మైసయ్య యాదవ్ సూచించారు విద్యుత్ చివరి దశలో కోతలు లేకుండా సకాలంలో విద్యుత్ అందిస్తే పంటలు జిల్లాలో ఎండిపోయే పరిస్థితి లేకుండేదని విద్యుత్ కోతల వల్లనే జిల్లాలో వరి పంటలు దెబ్బతిన్నాయని మైసయ్య యాదవ్ అన్నారు దీనికి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని సర్వేలు నిర్వహించి జిల్లాలో అన్ని మండలాలు సర్వే చేసి ఎండిపోయిన పంటలకు కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని మరొక్కసారి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ని రైతుల పక్షాన సంఘం పక్షాన మైసయ్య యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు

అక్టోబర్ 29న ఎల్లారెడ్డిలో ఎక్సైజ్ శాఖ వాహనాల బహిరంగ వేలం

-ఆసక్తి గల వారు వేలంలో పాల్గొని బిడ్లు దాఖలు చేయాలి: జిల్లా ఎక్సైజ్ అధికారి మంగమ్మ

ఎల్లారెడ్డి, అక్టోబర్ 27 (మహాప్రభ)



కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీమతి మంగమ్మ మార్గదర్శకత్వంలో అక్టోబర్ 29న ఈ వేలం నిర్వహించనున్నారు.

ఉదయం 9 గంటలకు వేలం ప్రారంభం

ఎల్లారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ ప్రాంగణంలో గురువారం ఉదయం 9 గంటలకు ప్రత్యక్ష వేలం ప్రారంభం కానుంది. స్టేషన్ పరిధిలో నమోదైన వివిధ కేసులకు సంబంధించి స్వాధీనం చేసుకున్న వాహనాలను వేలానికి ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు. వాహనాల కొనుగోలుకు ఆసక్తి ఉన్న వ్యక్తులు నిర్ణీత సమయానికి వేలం ప్రాంగణానికి చేరుకుని బిడ్లు దాఖలు చేయాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మంగమ్మ కోరారు. వేలానికి సంబంధించిన పూర్తి వివరాలు, నిబంధనల కోసం ఎల్లారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ అధికారులను సంప్రదించాలని సూచించారు.

ఎల్‌నినో ను సాకుగా చూపి ధరలు పెంచితే కఠిన చర్యలు

-నల్గొండ కలెక్టర్ బి. చంద్రశేఖర్



దేవరకొండ అక్టోబర్ 27(మహా ప్రభ)

నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు ప్రత్యేక నంబరు ఎల్‌నినోను సాకుగా చూపి ధరలు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ హెచ్చరిక విషయాలు తెలియజేశారు.

కృత్రిమ కొరత సృష్టించినా ఉపేక్షించేది లేదు: కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. ధరల పెంపుపై ప్రజలు ఫిర్యాదు చేయవచ్చునని అయిన అన్నారు. ఫిర్యాదులు, సమాచారాన్ని 9281423653 నంబరుకు తెలియజేయ గలరని ఆయన అన్నారు. వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు

దేవరకొండలో ఎమ్మెల్సీ ఓటర్ల అవగాహన సదస్సు: జగదీశ్వర్ రెడ్డి, రాకేష్ రెడ్డిలను సత్కరించిన సర్పంచ్ రమాదేవి రాములు

దేవరకొండ అక్టోబర్ 27(మహాప్రభ)



దేవరకొండ పట్టణంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఓట్ల అవగాహన సదస్సు సందర్భంగా ప్రముఖులు జగదీశ్వర్ రెడ్డి మరియు రాకేష్ రెడ్డి మరియు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రామావత్ రవీంద్ర కుమార్ లను తెలుగుపల్లి సర్పంచ్ చాట్ల రమాదేవి రాములు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్సీ ఓట్ల నమోదు, అర్హతలు మరియు అవగాహన సదస్సు ప్రాముఖ్యతపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా ప్రజల కోసం పనిచేద్దాం..

-వ్యక్తిగత విమర్శలకు దూరంగా.. నిర్మాణాత్మక ఆలోచనలకు దగ్గరగా సాగుదాం..

- వనపర్తి అభివృద్ధికి అందరం కలిసికట్టుగా అడుగులు వేద్దాం..

- రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు సహజం.. కానీ ప్రజా సంక్షేమం విషయంలో మనందరి లక్ష్యం ఒక్కటే కావాలి

-ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి!!



వనపర్తి అక్టోబర్ 27 మహాప్రభ

వనపర్తిలో ఉన్న స్నేహపూర్వక వాతావరణం, పరస్పర గౌరవం, ఐక్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.బి రాజకీయ విభేదాలను వ్యక్తిగత కక్షలుగా మార్చకుండా, సమాజానికి మేలు చేసే ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలి. సామాజిక మాధ్యమాలు వ్యక్తులను కించపరిచే వేదికలు కాకుండా, ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే సాధనాలుగా మారాలి. విమర్శించడంలో తప్పులేదు.. కానీ ఆ విమర్శలో వాస్తవం, వివేకం, బాధ్యత ఉండాలి. ప్రభుత్వ విధానాల్లోని లోపాలను ఎత్తిచూపుతూ, వాటి పరిష్కారాలకు మార్గాలు సూచించడం ప్రజాస్వామ్యానికి నిజమైన బలం. ఎన్నికల సమయంలో రాజకీయ పోటీ ఉండవచ్చు.. కానీ ఎన్నికల తర్వాత మనమంతా ఒకే ప్రాంత ప్రజలమనే భావనతో ముందుకు సాగాలి. వ్యక్తిగత విమర్శలు, పరస్పర ద్వేషాలు అభివృద్ధికి అడ్డంకులుగా మారకూడదు. చట్టాలను గౌరవిస్తూ, సమాజంలో శాంతి సామరస్యాలను కాపాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. వనపర్తి అభివృద్ధి ఒక్కరి బాధ్యత కాదు.. మనందరి ఉమ్మడి బాధ్యత...

మన మాటల్లో హుందాతనం.. మన ఆలోచనల్లో విశాలత్వం.. మన అడుగుల్లో అభివృద్ధి సంకల్పం ఉండాలి మార్పు కోసం ఎదుటివారిని ప్రశ్నించే ముందు మనమే ఆదర్శంగా నిలుద్దాం. నేటి మన ప్రవర్తనే రేపటి భావితరాలకు మార్గదర్శకం కావాలి. కక్షలుకాదు.. కలిసికట్టుగా కృషి చేద్దాం

దూషణలు కాదు..

నిర్మాణాత్మక చర్చలు జరుపుదాం విభేదాలు కాదు..

వనపర్తి అభివృద్ధే మనందరి ఎజెండా కావాలి

ప్రజా సంక్షేమమే పరమావధిగా.. వనపర్తి ప్రగతే లక్ష్యంగా ముందుకు సాగుదాం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం..

-నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలి..

-ఏఐసీసీ పరిశీలకుడు రవీంద్రదాస్ పిలుపు



వనపర్తి అక్టోబర్ 27 మహా ప్రభ

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఏఐసీసీ పరిశీలకుడు రవీంద్రదాస్ పిలుపునిచ్చారు. పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేస్తూ, పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్జీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని డీసీసీ అధ్యక్షులు శివసేన రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ పరిశీలకులు రవీంద్రదాస్, స్థానిక ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి సిద్దేశ్వర్, ఎస్ఐఆర్ ప్రక్రియ కోఆర్డినేటర్ శత్రురావు బుజ్జి హాజరయ్యారు. సమావేశానికి అధ్యక్షత వహించిన డీసీసీ చీఫ్ శివసేన రెడ్డి మాట్లాడుతూ... పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అత్యంత ప్రతిష్ఠాత్మకమని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, మండల అధ్యక్షులు, బూత్ లెవల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి మండలంలో కనీసం 500 మంది పట్టభద్రులను, మున్సిపాలిటీ పరిధిలో కనీసం వెయ్యి మంది పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించేందుకు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా నాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. మరోవైపు ఎస్ఐఆర్ ప్రక్రియ తుది దశకు చేరుకుంటున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని శివసేన రెడ్డి సూచించారు. ఓటరు జాబితాల పరిశీలనతోపాటు అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషిస్తోందని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు పార్టీ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న 'ఓట్ బచావో--దేశ్ బచావో' మహాధర్నాలో తెలంగాణ నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని శివసేన రెడ్డి కోరారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు జరిగే ఈ పోరాటంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ నాయకత్వానికి బలమైన మద్దతుగా నిలుస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలతోపాటు ఎస్ఐఆర్ ప్రక్రియలోనూ పార్టీ నాయకులు సమర్థవంతంగా పనిచేయాలని, ప్రతి స్థాయిలో సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో నేతలు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి క్షేత్రస్థాయి నుంచే పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు. ఈ యొక్క సమావేశంలో ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంకిని వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, సాయి చరణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బ్రహ్మం, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి రమేష్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పెబ్బేర్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, టౌన్ అధ్యక్షులు కదిరే రాములు, మండల అధ్యక్షులు రవి కిరణ్, మున్సిపల్ కౌన్సిలర్లు మహేశ్వరి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ జిల్లా అధ్యక్షులు రాజ్ కుమార్ , మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్య శీలా రెడ్డి , మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, పెబ్బేరు మండల అధ్యక్షులు రామ్ రెడ్డి, పెబ్బేర్ పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, గోపాల్పేట మండలం అధ్యక్షులు నరహరి, రేవల్లి మండల అధ్యక్షులు సుల్తాన్, ఏదుల మండల అధ్యక్షులు సుఖేందర్ రెడ్డి, పెద్దమందడి మండల అధ్యక్షుడు వెంకటస్వామి, గణపురం మండల అధ్యక్షులు కృష్ణ యాదవ్, శ్రీరంగపురం మండల అధ్యక్షులు విష్ణు ముదిరాజ్, మన్యం, యాదగిరి వాల్మీకి, సర్పంచులు రాములు, వాలియా నాయక్ , యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆదిత్య, యూత్ కాంగ్రెస్ నాయకులు పాండు సాగర్, శివ కుమార్ నాయుడు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు శ్రీకాంత్, రోహిత్, అన్ని మండలాల టౌన్ బిఎల్ఎలు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే నా లక్ష్యం...

-కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



శేరిలింగంపల్లి,(అక్టోబర్ 27) మహా ప్రభ

విద్యాభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సమగ్ర శిక్షా అభియాన్ లో భాగంగా శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి సుమారు రూ. 3.3 కోట్ల రూపాయలతో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే 11 అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాష్ చంద్రారెడ్డి,పిఆర్టీయూ జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డి తో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వాల లక్ష్యమని.. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. సమగ్ర శిక్షా పథకం ద్వారా మంజూరైన రూ. 3.3 కోట్ల నిధులతో నిర్మించబోయే అదనపు తరగతి గదుల వల్ల పాఠశాలలో విద్యార్థులకు మరింత మెరుగైన వసతులు కలుగుతాయని..రద్దీ తగ్గి ప్రశాంత వాతావరణంలో విద్యను అభ్యసించే అవకాశం కలుగుతుందని తెలిపారు. నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని విద్యాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కొయ్యడ లక్ష్మణ్ యాదవ్, పీ.డీ టీచర్ కేశవ రెడ్డి, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖాజాగూడ జంక్షన్‌లో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా రోడ్డు పనులు చేపట్టాలి: సైబరాబాద్ సీపీ



సైబరాబాద్,(అక్టోబర్ 27) మహా ప్రభ

రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖాజాగూడ జంక్షన్‌ను సందర్శించి, అక్కడ జరుగుతున్న రోడ్డు పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో సమీక్షించారు.

రాయదుర్గం ప్రాంతంలో జరుగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనుల నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చేపట్టాల్సిన చర్యలపై పోలీస్ అధికారులు, జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ అధికారులతో చర్చలు జరిపారు. అండర్‌పాస్ నిర్మాణానికి సంబంధించి పైప్‌లైన్ల ఏర్పాటు, విద్యుత్ లైన్ల మార్పులు, ఇతర సాంకేతిక అంశాలపై అధికారులతో సమీక్షించారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్‌ను తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలమైన మణికొండలోని జీహెచ్ఎంసీ కమిటీ హాల్‌ను ఉన్నత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించారు. పోలీస్ స్టేషన్‌ను తాత్కాలికంగా ఎక్కడ ఏర్పాటు చేస్తే ప్రజలకు, పోలీస్ సిబ్బందికి సౌకర్యవంతంగా ఉంటుందనే అంశంపై సంబంధిత అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ, "ఫ్లైఓవర్ నిర్మాణ పనుల సమయంలో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. రాయదుర్గం పోలీస్ స్టేషన్‌ను తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి. ట్రాఫిక్ సజావుగా సాగేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలి" అని సూచించారు. ప్రజల సౌకర్యం, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులను సమన్వయంతో చేపట్టాలని సీపీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ట్రాఫిక్ డీసీపీ రవికుమార్, మాదాపూర్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ హనుమంత్ రావు, ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్, లా అండ్ ఆర్డర్ ఏసీపీ శ్రీధర్, రాయదుర్గం ఎస్ హెచ్ ఓ భూపతి, ట్రాఫిక్ ఎస్ హెచ్ ఓ పవన్ మరియు ఇతర పోలీస్ ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

కమీషన్ల కక్కుర్తితో.. రైతుల నోట మట్టి!

- అధిక దిగుబడి పేరు చెప్పి రైతులను బురిడీ కొట్టిస్తున్నారా?
- 35 క్వింటాళ్ల దిగుబడి ఆశ చూపి విత్తనాలు అంటగట్టారని ఆరోపణలు..
- 35 క్వింటాళ్ల ఆశ.. పాట్టిగా వచ్చిన కంకులు!
- నమ్మకాన్ని పెట్టుబడిగా చేసుకుని వ్యాపారం!
- నిలదీస్తే 'ఏం చేసుకుంటారో చేసుకోండి' అంటున్నారంటూ రైతుల ఆగ్రహం!





రామాయంపేట అక్టోబర్ 27 మహాప్రభ

రైతు చెమటోడ్చి పంట పండిస్తేనే కుటుంబానికి నాలుగు మెతుకులు దక్కేది. అప్పులు చేసి పెట్టుబడి పెట్టి, రేయింబవళ్లు కష్టపడి పంటను కంటికి రెప్పలా కాపాడుకునే అన్నదాతకు నాణ్యమైన విత్తనాలు అందించాల్సిన వ్యాపారులే నిలువునా ముంచుతున్నారనే ఆరోపణలు రామాయంపేటలో కలకలం రేపుతున్నాయి. అధిక కమీషన్లకు ఆశపడి రైతులకు నాసిరకం విత్తనాలు అంటగడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తెలిసిన బ్రాండెడ్ కంపెనీ విత్తనాల కోసం దుకాణానికి వెళ్తే.. 'మమ్మల్ని నమ్మండి.. మేమిచ్చే విత్తనాలతో మంచి దిగుబడి వస్తుంది.. ఎకరాకు 35 క్వింటాళ్ల ధాన్యం పండుతుంది' అంటూ నమ్మబలికారని రైతులు ఆరోపిస్తున్నారు. వ్యాపారుల మాటలు నమ్మి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తీరా పొలంలో మాత్రం చేదు అనుభవం ఎదురైందని వాపోతున్నారు. తొలిదశలోనే కొన్ని విత్తనాలు మొలకెత్తకపోగా, పంట ఎదిగిన చోట వరి కంకులు పొట్టిగా రావడంతో దిగుబడిపై ఆశలు ఆవిరయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను చూసి కన్నీళ్లు పెట్టుకోవాల్సిన దుస్థితి వచ్చిందని మండిపడుతున్నారు.

నమ్మకాన్ని పెట్టుబడిగా చేసుకుని వ్యాపారం!

విత్తనాల దుకాణాలకు వెళ్లే రైతులు కంపెనీల పేర్లు, విత్తనాల నాణ్యత, దిగుబడి సామర్థ్యంపై ఆరా తీస్తుంటారు. అయితే రైతులకు తెలిసిన బ్రాండెడ్ విత్తనాలను అడిగితే, వాటి కంటే తాము సూచించే విత్తనాలే మెరుగైనవని నమ్మబలుకుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. వ్యాపారుల మాటలను నమ్మి విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు, పంట చేతికొచ్చే సమయానికి నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారని చెబుతున్నారు. రైతులకు ఏ కంపెనీ విత్తనాలు విక్రయించారు? వాటి నాణ్యత ఏమిటి? విక్రయాల వెనుక అధిక కమీషన్ల ప్రలోభాలు ఉన్నాయా? అన్న ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఈ ఆరోపణలపై వ్యవసాయ శాఖ అధికారులు విచారణ జరిపి వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది.

35 క్వింటాళ్ల ఆశ.. పొట్టిగా వచ్చిన కంకులు!

వరి సాగులో అధిక దిగుబడి వస్తుందనే ఆశతో రైతులు పెట్టుబడులు పెడుతున్నారు. ఎరువులు, కూలీల ఖర్చులు, సాగునీటి వ్యయం అన్నీ కలిపి వ్యవసాయం భారంగా మారిన తరుణంలో విత్తనాల ఎంపిక రైతులకు అత్యంత కీలకం. ఇలాంటి పరిస్థితుల్లో ఎకరాకు 35 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని నమ్మబలికి విత్తనాలు విక్రయించారని రైతులు ఆరోపిస్తున్నారు. తీరా పంట ఎదిగిన తర్వాత వరి కంకులు చిన్నగా రావడంతో ఆశించిన దిగుబడి వస్తుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. కొందరి పొలాల్లో నారు కోసం వేసిన విత్తనాలు సైతం సరిగా మొలకెత్తలేదని చెబుతున్నారు. పంట సాగు ప్రారంభంలోనే ఎదురైన ఇబ్బందులు మొదలుకుని, కంకులు పొట్టిగా రావడం వరకు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని బాధితులు వాపోతున్నారు. దిగుబడి తగ్గితే అప్పులు ఎలా తీర్చాలి? కుటుంబాలను ఎలా పోషించాలి? అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నష్టపోయిన రైతులనే బెదిరిస్తున్నారా?

విత్తనాలు బాగా లేవని, పంట ఆశించిన విధంగా రావడం లేదని దుకాణాల యాజమాన్యాన్ని నిలదీస్తే బాధ్యత తీసుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. 'మేము మా కంపెనీ విత్తనాలే ఇచ్చాం.. ఏం చేసుకుంటారో చేసుకోండి' అన్న ధోరణిలో సమాధానం చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలు అమ్మేటప్పుడు అధిక దిగుబడి వస్తుందని భరోసా ఇచ్చిన వ్యాపారులు, నష్టం జరిగిన తర్వాత మాత్రం తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే రామాయంపేట పట్టణంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణం యాజమాన్యంతో కొందరు రైతులు వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. రైతుల ఆవేదనను అర్థం చేసుకుని పరిష్కారం చూపాల్సిన వ్యాపారులు బాధ్యత నుంచి తప్పించుకుంటే తమకు న్యాయం ఎవరు చేస్తారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. పోలీసులు, వ్యవసాయ అధికారులను ఆశ్రయించినా.. తమకు జరిగిన అన్యాయంపై బాధిత రైతులు రామాయంపేట పోలీసులను, వ్యవసాయ శాఖ అధికారులను ఆశ్రయించినట్లు తెలిపారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటివరకు తమకు న్యాయం జరగలేదని వాపోతున్నారు. ఫిర్యాదులు చేసినా, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోతే ఇక ఎవరిని ఆశ్రయించాలని ప్రశ్నిస్తున్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులు, కంపెనీ పేర్లు, బ్యాచ్ నంబర్లు పరిశీలించి, సంబంధిత విత్తనాల నమూనాలను పరీక్షించాలని కోరుతున్నారు. పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టం అంచనా వేయాలని, విత్తనాల్లో నాణ్యతా లోపాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల తనిఖీలు ఎక్కడ?


ప్రతి సాగు సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చూడాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖపై ఉంది. విత్తనాల విక్రయాలపై పర్యవేక్షణ, నాణ్యతా ప్రమాణాల తనిఖీలు, రైతుల ఫిర్యాదులపై సత్వర స్పందన కీలకం. అయినప్పటికీ, రైతులు విత్తనాల నాణ్యతపై అనుమానాలు వ్యక్తం చేస్తూ అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది. రామాయంపేటలో విక్రయించిన విత్తనాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. సంబంధిత దుకాణాల లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలు విక్రయాల రికార్డులు పరిశీలించాలి. విత్తనాల నాణ్యతపై శాస్త్రీయ పరీక్షలు నిర్వహించి, రైతుల ఆరోపణల్లో వాస్తవమెంత ఉందో స్పష్టం చేయాలి.

అన్నదాతను మోసం చేస్తే ఉపేక్షించొద్దు!

రైతు నష్టపోతే అది ఒక్క కుటుంబానికే పరిమితం కాదు.. వ్యవసాయ రంగంపైనా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం చూపుతుంది. విత్తనాల నాణ్యతలో లోపం ఉన్నట్లు నిర్ధారణ అయితే సంబంధిత తయారీ సంస్థలు, విక్రేతలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. నష్టపోయిన రైతులకు పరిహారం అందించే అవకాశాలను పరిశీలించాలి. అయితే పంట దిగుబడి తగ్గడానికి విత్తనాల నాణ్యతతో పాటు వాతావరణం, నీటి నిర్వహణ, తెగుళ్లు వంటి ఇతర కారణాలు కూడా ఉండే అవకాశం ఉన్నందున నిపుణుల పరిశీలన తప్పనిసరి. కమీషన్ల కక్కుర్తి నిజంగానే రైతుల కొంపముంచిందా? బ్రాండెడ్ విత్తనాల పేరుతో నమ్మించి వేరే విత్తనాలు విక్రయించారా? రైతులు ఆరోపిస్తున్నట్లుగా విత్తనాల నాణ్యతలో లోపాలున్నాయా? ఈ ప్రశ్నలకు వ్యవసాయ శాఖ అధికారుల విచారణే సమాధానం చెప్పాలి. రైతులను నిలువునా ముంచే వ్యాపార ధోరణికి అడ్డుకట్ట వేయాలి.. అన్నదాతకు న్యాయం జరిగేలా అధికారులు తక్షణమే స్పందించాలి అని బాధిత రైతులు కోరుతున్నారు.

దేవేందర్ రెడ్డి మృతికి ఎర్రబెల్లి
దయాకర్ రావు సంతాపం

చిన్నవంగరలో కుటుంబ సభ్యులకు పరామర్శ.. పార్థివదేహానికి నివాళులు



పెద్దవంగర అక్టోబర్ 27 (మహాప్రభ)

మండలంలోని చిన్నవంగర గ్రామానికి చెందిన పాకనాటి దేవేందర్ రెడ్డి అనారోగ్యంతో కన్నుమూయడంతో రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విచారం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఆయన గ్రామంలోని దేవేందర్ రెడ్డి నివాసానికి చేరుకుని పార్థివదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను కలిసి వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో వారు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి పార్టీ నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, సోషల్ మీడియా విభాగం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం..

-డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుపై ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి ప్రత్యేక దృష్టి!
-రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల అధికారుల సమావేశంలో ప్రజా సమస్యలను ప్రస్తావించిన నర్సాపూర్ ఎమ్మెల్యే





నర్సాపూర్ అక్టోబర్ 27(మహాప్రభ)

సంగారెడ్డిలో నిర్వహించిన రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల సమావేశంలో నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, పీఓటీ పట్టాల సమస్యలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నవాబ్‌పేట, రత్నాపూర్, కొంగోడు, ఎం. జలాల్‌పూర్, రైలాపూర్ తండా గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను కోరారు. అదేవిధంగా వారిగుంతం, సంగాయిపేట, కుల్చారం, చిన్నఘనపూర్, ఎనగండ్ల, అంసాన్‌పల్లి గ్రామాల్లో పీఓటీ పట్టాలకు సంబంధించిన సమస్యలను ప్రస్తావిస్తూ, అర్హులైన ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. అలాగే నర్సాపూర్, దొంతి, హత్నూర ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. ఇళ్ల కోసం నిరీక్షిస్తున్న పేద కుటుంబాల సమస్యలను పరిగణనలోకి తీసుకొని, అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయడంపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా దృష్టి సారించారు.

తూప్రాన్ పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్
కార్యక్రమంతో విద్యార్థులకు అవగాహన

పోలీసుల త్యాగాల బాధ్యతలనపై సంపూర్ణ అవగాహన



తూప్రాన్ అక్టోబర్ 27,(మహాప్రభ)

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం

ఈరోజు తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోలీస్ శాఖ విధులు, బాధ్యతలు, పోలీసుల త్యాగాలు మరియు పోలీస్ వ్యవస్థ పనితీరుపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తూప్రాన్ సబ్ డివిజన్ డీఎస్పీ నరేంద్ర గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల ప్రాణాలకు మరియు ఆస్తులకు రక్షణ కల్పించడం, నేరాల నియంత్రణలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు.

విధి నిర్వహణలో భాగంగా దేశ ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ, వారి త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, సమయపాలన, దేశభక్తి, చట్టాల పట్ల గౌరవం వంటి మంచి లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా పోలీస్ మరియు ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన పోలీస్ అధికారులు వివిధ రకాల పోలీస్ ఆయుధాలు, వాటి వినియోగం, పనితీరు మరియు విధి నిర్వహణలో వాటి ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. పోలీస్ శాఖలో ఉపయోగించే ఆయుధాలు, పరికరాలు, వాటి భద్రతా నియమాలు మరియు పోలీసుల విధుల గురించి విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కల్పించారు. ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరు, పోలీసుల బాధ్యతలు, ఎదురయ్యే సవాళ్లు మరియు ప్రజా రక్షణలో పోలీసుల పాత్ర గురించి తెలుసుకునే అవకాశం లభించింది. అంతేకాకుండా, పోలీస్ శాఖపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడంతో పాటు పోలీస్-ప్రజల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమంలో , తూప్రాన్ టౌన్ ఎస్ఐ వి. గంగరాజు, ఎస్ఐ జ్యోతి, ఎస్ఐ యాదగిరి, ఎస్ఐ మధుసూదన్ రావు,ఏఆర్ఎస్ఐ శ్రీ భవానీ కుమార్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. పోలీసులు సమాజ రక్షణ కోసం నిరంతరం కృషి చేస్తూ, ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా విధులు నిర్వహిస్తారని ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు తెలియజేయడం జరిగింది.

ముగిసిన మండల క్రీడా పోటీల ఎంపికలు

-ఎల్లారెడ్డి జోనల్ పోటీలకు గాంధారి జట్లు ఎంపిక



గాంధారి అక్టోబర్ 27(మహాప్రభ)

ఎల్లారెడ్డి జోనల్ పోటీలకు వెళ్లే గాంధారి మండల క్రీడా జట్లను ఎంపిక చేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. 14, 17 సంవత్సరాల విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి శ్రీహరి ఆదేశానుసారం ఈ క్రీడా పోటీలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెట్ సంగంలో నిర్వహించారు.పోటీలను ప్రధానోపాధ్యాయులు కుమార స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ..చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చి జీవితంలో మంచి స్థానంలో స్థిరపడవచ్చన్నారు. మానసిక ఉల్లాసానికే కాకుండా శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ పోటీల్లో గాంధారి, పెట్ సంగం, పోతంగల్, గండిపేట్, చద్మల్, మండల క్రీడాకారులు పాల్గొన్నారు.

అమర వీరుల సంస్మరణ వారంలో భాగంగా నేడే రక్తదాన శిబిరం..

- ప్రాణదాతలుగా నిలవాలని శివ్వంపేట ఎస్ ఐ మధుకర్ రెడ్డి పిలుపు!



శివ్వంపేట అక్టోబర్ 27(మహాప్రభ)

తలసేమియా చిన్నారుల ప్రాణరక్షణకు ముందుకు రావాలి -- శివ్వంపేట ఎస్ ఐ మధుకర్ రెడ్డి పిలుపునిచ్చారు అమర వీరుల సంస్మరణ వారం సందర్భంగా మెదక్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శివంపేట ఎస్ ఐ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ బుధవారం మనోహరాబాద్‌లో రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు శివంపేట్ మండల ప్రజలు, యువత, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. మనోహరాబాద్‌లోని శుభం ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 గంటలకు రక్తదాన శిబిరం ప్రారంభం కానుంది. ముఖ్యంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు రక్తం ఎంతో అవసరమని, రక్తదానం ద్వారా వారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. రక్తదానం అనేది కేవలం దానం మాత్రమే కాదని, ఆపదలో ఉన్నవారికి పునర్జన్మనిచ్చే మహత్తర సేవ అని తెలిపారు. ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని శివ్వంపేట ఎస్ ఐ మధుకర్ రెడ్డి పిలుపునిచ్చారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై
బీఆర్ఎస్ సమీక్షా సమావేశం



పెద్దవంగర, అక్టోబర్ 27: (మహాప్రభ)

రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సూచించారు. మంగళవారం పెద్దవంగర మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించేలా గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని, నాయకులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ తీరుపై విమర్శలు చేస్తూ, విద్యుత్ కోతలు, దేవాదుల ప్రాజెక్టు నిర్వహణ వంటి అంశాల్లో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కరోనా సమయంలో ప్రజలకు అవసరమైన సేవలు అందించడంలో కేసీఆర్ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో మండల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారం, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

-డ్రగ్స్, సైబర్ నేరాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలి

-నిజాంపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్



మెదక్ అక్టోబర్ 27,(మహాప్రభ)
మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ మంగళవారం నిజాంపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజేష్ మొక్కను అందజేసి ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని, జజుచీూ, ఈ-సాక్ష్య అప్లికేషన్లలో వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. షీ టీమ్స్ ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల్లో 'పోలీస్ అక్క' కార్యక్రమం నిర్వహించాలని, ఫూలు ప్రతి గ్రామాన్ని సందర్శించి డ్రగ్స్ దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కళాబృందాల సహకారంతో విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. అనంతరం సిబ్బందితో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, అవినీతికి పాల్పడితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలో సీఐలు సైదా, సందీప్ రెడ్డి, ఎస్ఐ రాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడే దేవరకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కార్యక్రమాలు..



దేవరకొండ అక్టోబర్ 27(మహా ప్రభ)
ఉదయం 10:00 గంటలకు చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ శివసాయి కాటన్ జిన్నింగ్ మిల్ లో సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారు. 10:30 గంటలకు చింతపల్లి మండలం, ఉప్పరపల్లి గ్రామంలో సమగ్ర భూసర్వేపై గ్రామసభ లో పాల్గొంటారు. మధ్యాహ్నం 12:00 గంటలకు చందంపేట మండలం, చీత్రియాల గ్రామంలో హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తారు. 12:30 గంటలకు చందంపేట మండలం, బుడ్డోని తండా గ్రామ పరిధిలోని వెంకట్ తండాలో సీసీ రోడ్డు ప్రారంభోత్సవం లో పాల్గొంటారు. 1:00 గంటలకు చందంపేట మండలం రేకులగడ్డ గ్రామంలో హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తారు. 1:30 గంటలకు చందంపేట మండలం, యాపలపాయ తండాలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కీరు నాయక్ (సర్పంచ్ మకట్ లాల్ తండ్రి) విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు.
3:00 గంటలకు చందంపేట మండలం, మూడుదండ్ల గ్రామంలో మహిళ సమాఖ్య భవనం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని అనంతరం ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాల్లో పాల్గొంటారు.ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం – దేవరకొండ. ప్రకటనలో తెలిపారు.

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించే వరకు ఉద్యమం ఆగదు

నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో భారీ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలి:

-ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణ

-సిద్దిపేటలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఛలో ఢిల్లీ పోస్టర్ల విడుదల



సిద్దిపేట అక్టోబర్ 27,(మహాప్రభ)
కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన SIR (ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ) ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సిద్దిపేట నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణ స్పష్టం చేశారు. నేడు సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఛలో ఢిల్లీ పోస్టర్ల విడుదల చేసారు.వారు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలనే డిమాండ్‌తో పాటు, ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఉద్యమం కొనసాగుతుందని పేర్కొన్నారు.
నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు నిర్వహించనున్న భారీ నిరసన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, పీసీసీ ఆధ్వర్యంలో.సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ గారి మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన రాజ్యాంగ హక్కు అని, ఆ హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని అన్నారు. ూ×= ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే పరిస్థితులు ఏర్పడకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత పాటిస్తూ, ప్రతి అర్హుడైన పౌరుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని కాపాడాలి. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాల్సిన వ్యవస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల హక్కులకు భంగం కలిగించే చర్యలు చోటుచేసుకుంటే కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున గట్టిగా ప్రశ్నిస్తుందని స్పష్టం చేశారు.
నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సిద్దిపేట నియోజకవర్గం నుంచి యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పూజల గోపికృష్ణ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సాగుతున్న ఈ పోరాటంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త భాగస్వామి కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు వాహబ్.జిల్లా మైనార్టీ చైర్మన్ రసాత్-ూావీజ వైస్ చైర్మన్ పవన్.జిల్లా ఆత్మ డైరెక్టర్ జనార్దన్. పట్టణ అధ్యక్షుడు ఆతిఫ్.డైరెక్టర్ ప్రభాకర్.శ్రవణ్.నవీన్.పవన్.ఇమ్రాన్.ఫీసల్.తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే జీఎంఆర్ ఆకస్మిక తనిఖీ

-సర్టిఫికెట్ల జారీలో జాప్యంపై ఆగ్రహం.. ప్రజలను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని హెచ్చరిక

-శిథిలావస్థలో ఉన్న కార్యాలయ భవనానికి మరమ్మతులు చేపట్టాలని ఆదేశం



దేవరకద్ర, నియోజకవర్గం అక్టోబర్ 27 మహాప్రభ
ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని, వారిని అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి (జీఎంఆర్) అధికారులను ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, ప్రజలను ఇబ్బందులకు గురిచేసినా బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం దేవరకద్ర మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి, ప్రజలకు అందుతున్న రెవెన్యూ సేవలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సర్టిఫికెట్ల జారీలో జాప్యంపై ఆరా
కుల, ఆదాయ తదితర ధ్రువపత్రాలతో పాటు భూ సంబంధిత పనుల కోసం కార్యాలయానికి వచ్చే దరఖాస్తుదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న ఫిర్యాదులపై ఎమ్మెల్యే స్పందించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం ఎందుకు జరుగుతోందని అధికారులను ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీల వివరాలను పరిశీలించి, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలో జారీ చేయాలని సూచించారు. ప్రభుత్వ సేవల్లో పారదర్శకత పాటిస్తూ, ప్రజల సమస్యలను బాధ్యతాయుతంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు.

అవినీతికి తావిస్తే చర్యలు తప్పవు
రెవెన్యూ సేవలందించే క్రమంలో అక్రమాలకు పాల్పడినా, లంచాలు డిమాండ్ చేసినా సహించేది లేదని జీఎంఆర్ హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యానికి తావివ్వకూడదని సూచించారు. అవినీతి ఆరోపణలు ఎదురైన సందర్భాల్లో నిబంధనల ప్రకారం విచారణ, చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అవసరమైతే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఫిర్యాదు చేసే పరిస్థితులు వస్తాయని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించడంపై అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు.

శిథిల భవనానికి మరమ్మతులు చేపట్టాలి
తనిఖీలో భాగంగా తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తించారు. భవనం పరిస్థితిని పరిశీలించి, అవసరమైన మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు, విధులు నిర్వహించే సిబ్బంది భద్రతకు ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు. భవనానికి సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
ఈ తనిఖీలో డిప్యూటీ తహసీల్దార్ దీపిక, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శరత్, ఫహద్, జీపీఓ రాజు, రామకృష్ణారెడ్డితో పాటు కార్యాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టెక్స్ అకాడమీ ద్వారా డిగ్రీ చదువుతున్న విద్యార్థి నూలకు ఉచిత ఆన్లైన్ స్కాలర్‌షిప్ పరీక్ష .



హైదరాబాద్అక్టోబర్ 27 (మహాప్రభ):
టెక్స్ అకాడమీ ఆధ్వర్యంలో డిగ్రీ చదువుతున్న విద్యార్థి నూలకు, ఉచితంగా కంప్యూటర్ కోర్సులను స్రఅందించడానికి ఉచిత ఆన్లైన్ స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహించింది. పరీక్షలో విజయం సాధించిన వారికి ఉచిత కంప్యూటర్ కోర్సులను అందించనున్నారు.ఈ సందర్భంగా ఉచిత ఆన్లైన్ పరీక్షను నిర్వహించినందుకు నాగార్జునసాగర్ రోడ్డు బిఎన్ రెడ్డి నగర్ లో గల ఏమ్స్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ ప్రిన్సిపాల్ ఎం.గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఉచిత స్కాలర్‌షిప్ పరీక్ష లో విజయం సాధించిన అశ్విత ,
చల్లా ఉమ, బావుగారి అక్షిత గౌడ్ కు ఈ సదావకాశాన్ని వినియోగించుకొని జీవితం లో ఉన్నతా శిఖరాలను అధిరోహించాలని కోరుకు న్నారు. ఏమ్స్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్‌వైస్ ప్రిన్సిపాల్ ఆర్య సుస్మిత మాట్లాడుతూ ఉచిత స్కాలర్‌షిప్ పరీక్ష, కోర్సులు, ప్లేస్మెంట్ అందించే డ్రైవ్ల విద్యార్థుల కెరీర్ కి ఖచ్చితంగా సహాయపడతాయని అన్నారు. ఈ ఉచిత స్కాలర్‌షిప్ పరీక్ష విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధి అవకాశాల కొరకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు .టెక్స్ అకాడమీ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ మోహన్ దాస్ మాట్లాడుతూ ఉచిత ఆన్‌లైన్ పరీక్షలో ఉత్తీర్ణులైనా వారికి శుభాకాంక్షలు తెలుపుతూ డిగ్రీ కు సంబందించిన డేటా అనలిటిక్స్, బిజినెస్ అనలిటిక్స్, అడ్వాన్స్ ఎక్సెల్,డేటా సైన్స్, కృత్రిమ మేధస్సు కోర్సులు నెర్చుకోవాలన్నారు.కార్యక్రమంలో ఏమ్స్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మండల స్థాయి ఆటల పోటీలు ఆనందంగా పాల్గొన్న 45 మంది విద్యార్థినీ, విద్యార్థులు



గాంధారి అక్టోబర్ 27 (మహాప్రభ)
మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న దాదాపు 45 మంది వివిధ కేటగిరీలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు ఈ పోటీల్లో ఆనందంగా పాల్గొన్నారు.
వీరికి రన్నింగ్, షార్ట్ ఫుట్, మ్యూజికల్ చైర్, వ్యాసరచన, పాటల పోటీలను నిర్వహించారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి శ్రీహరి మాట్లాడుతూ.. భవిత కేంద్రంలో అందించే ప్రత్యేక విద్యతోపాటు నరాల బలహీనతతో బాధ పడుతున్న విద్యార్థులకు ప్రతివారం రెండు ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించ బడతాయని తెలిపారు.పాఠశాలలో అందించే సౌకర్యాలను మరియు ఆటల పోటీలను వినియోగించుకొని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో బహుమతులు గెలుపొందాలని కొత్తంగల్ కాంప్లెక్స్ ప్రధానో పాధ్యాయులు రంగారావు తెలిపారు. వివిధ గ్రామాల్లోని విద్యార్థులందరూ క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చినప్పుడే మంచి విద్యాబుద్ధులు నేర్చుకొని ఉన్నత స్థాయికి ఎదుగుతారని గండిపేట్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు.

పెద్దవంగర పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు పోలీసు విధులపై అవగాహన



పెద్దవంగర: అక్టోబర్ 27 (మహాప్రభ)
అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పెద్దవంగర పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విద్యార్థుల కోసం బహిరంగ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీహెచ్ఎస్ పెద్దవంగర పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్సై ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పోలీసు శాఖ విధులు, స్టేషన్ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరు, స్వీకరణ విభాగం విధులు, స్టేషన్ ఇన్‌చార్జి బాధ్యతలు, స్టేషన్ హౌస్ అధికారి విధులు, వీఎచ్ఎఫ్ సమాచార ప్రసార పరికరం వినియోగం గురించి వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ పోలీసు సేవలు అందించే డయల్ 100 వ్యవస్థ పనితీరును ప్రత్యక్షంగా పరిచయం చేశారు. నేరాలు, నేరస్థులకు సంబంధించిన సమాచారాన్ని నమోదు చేసి నిర్వహించే ఆన్‌లైన్ నేర, నేరస్థుల గుర్తింపు సమాచార వ్యవస్థ (సీసీటీఎన్ఎస్) పనితీరును విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోలీసుల విధులు, శాంతిభద్రతల పరిరక్షణలో వారి పాత్ర, అత్యవసర సమయాల్లో పోలీసులను సంప్రదించే విధానాలపై అవగాహన కల్పించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పోలీసు వ్యవస్థపై అవగాహన పెంపొందించడంతో పాటు ప్రజలకు, పోలీసులకు మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడానికి దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

దేవరకొండలో బి.ఆర్.ఎస్.' ఎం.ఎల్.సి. ఎన్నికల సన్నాహక సమావేశంకి ఘనంగా స్వాగతం పలికిన రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్



దేవరకొండ అక్టోబర్ 27(మహాప్రభ)
దేవరకొండ నియోజకవర్గ బి.ఆర్.ఎస్. పార్టీ ఆధ్వర్యంలో రాబోయే పట్టభద్రుల ఎం.ఎల్.సి. ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించబడింది. మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఉమ్మడి నల్గొండ జిల్లా బి.ఆర్.ఎస్. పార్టీ అధ్యక్షులు రామావత్ రవీంద్ర కుమార్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రివర్యులు సూర్యాపేట శాసనసభ్యులు జగదీశ్వర్ రెడ్డి కీ, ఎం.ఎల్.సి.అభ్యర్థి యువనేత రాకేష్ రెడ్డి కీ బి.ఆర్.ఎస్.పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ మరియు ఇతర ముఖ్య నాయకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచడమే లక్ష్యం

-ఎఫ్ఎల్ఎన్ అమలులో నిర్లక్ష్యం వద్దు..

- ప్రతి విద్యార్థి ప్రగతిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: దేవరకద్ర ఎంఈఓ పి.బలరాం



దేవరకద్ర నియోజకవర్గ అక్టోబర్ 27 మహాప్రభ

దేవరకద్ర: ప్రభుత్వ పాఠశాలల్లో తొలిమెట్టు (ఎఫ్ఎల్ఎన్), ఎల్ఐపీ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తూ విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చాలని దేవరకద్ర మండల విద్యాధికారి పి.బలరాం సూచించారు. తరగతుల వారీగా నిర్దేశించిన విద్యా లక్ష్యాలను సాధించేలా ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా బోధన సాగించాలని స్పష్టం చేశారు.

మంగళవారం దేవరకద్రలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బలరాం మాట్లాడుతూ విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని అన్నారు.

ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలు అలవడాలి

విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ సూచించారు. క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకాని విద్యార్థులను గుర్తించి, వారు ప్రతిరోజూ బడికి వచ్చేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థిలో చదవడం, రాయడం, గణిత ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని స్పష్టం చేశారు. తరగతుల వారీగా, సబ్జెక్టుల వారీగా స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని బోధన చేపట్టాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపునకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో కోయిల్‌సాగర్ స్కూల్ కాంప్లెక్స్ జీహెచ్ఎం కె.రమేష్, దేవరకద్ర బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయకృష్ణ, లక్ష్మీపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.మురళీధర్‌తో పాటు మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

-అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రేపు రక్తదాన శిబిరం

-జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పిలుపు



మెదక్ అక్టోబర్ 27,(మహా ప్రభ)

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం 9 గంటల నుంచి మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ శిబిరంలో యువత, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం ఎంతోమంది ప్రాణాలను కాపాడే గొప్ప సేవ అని ఎస్పీ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడినవారికి, శస్త్రచికిత్సలు చేయించుకునే రోగులకు, ప్రసవ సమయంలో రక్తం అవసరమైన మహిళలకు రక్తం ఎంతో కీలకమని తెలిపారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని, ఆరోగ్యంగా ఉన్న అర్హులైన వ్యక్తులు వైద్య సిబ్బంది సూచనల మేరకు రక్తదానం చేయాలని ఎస్పీ సూచించారు. రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

బొల్లారంలో పర్యాటక అభివృద్ధికి భూముల గుర్తింపు.. క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన

డీఆర్ఓ నిర్మల ఆధ్వర్యంలో పర్యాటక ప్రాజెక్టుకు భూముల అన్వేషణ



దేవరకద్ర నియోజకవర్గం అక్టోబర్ 27 మహాప్రభ

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం బొల్లారం గ్రామంలో పర్యాటక అభివృద్ధికి మార్గం సుగమం చేసే దిశగా అధికారులు భూముల గుర్తింపు ప్రక్రియ చేపట్టారు. గ్రామంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి, స్థానిక ప్రాంతానికి కొత్త గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో రెవెన్యూ, నీటిపారుదల, యువజన, క్రీడలు, పంచాయతీరాజ్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. డీఆర్ఓ నిర్మల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా పర్యాటక అభివృద్ధికి అనువైన భూములు, అందుబాటులో ఉన్న వనరులు, సంబంధిత అంశాలను అధికారులు పరిశీలించారు. వివిధ శాఖల సమన్వయంతో భూముల గుర్తింపు, వాటి అనుకూలతపై సమగ్రంగా అధ్యయనం చేయడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశంగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి, నీటిపారుదల శాఖ అధికారులు, మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ), పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ), గ్రామ పంచాయతీ అధికారి (జీపీఓ) పాల్గొన్నారు. బొల్లారం గ్రామస్థులు సైతం ఈ ప్రక్రియలో భాగస్వాములయ్యారు. పర్యాటక అభివృద్ధి అనేది కేవలం ఒక ప్రాంతాన్ని సందర్శనా స్థలంగా తీర్చిదిద్దడమే కాకుండా, స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పనకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి, గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి దోహదపడే అంశం. ఈ నేపథ్యంలో బొల్లారం గ్రామంలో పర్యాటక అభివృద్ధికి అనువైన అవకాశాలను గుర్తించడం ప్రాధాన్యత సంతరించుకుంది. వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో చేపట్టిన ఈ పరిశీలన ద్వారా పర్యాటక అభివృద్ధికి అవసరమైన అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. భూముల గుర్తింపు ప్రక్రియ తదుపరి కార్యాచరణకు పునాదిగా నిలవనుంది. బొల్లారం గ్రామం పర్యాటక రంగంలో అభివృద్ధి చెందితే స్థానిక ప్రజలకు కొత్త అవకాశాలు అందుబాటులోకి రావడంతో పాటు, గ్రామాభివృద్ధికి కూడా ఊతం లభించే అవకాశం ఉంది. ప్రభుత్వ శాఖల సమన్వయం, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో బొల్లారంలో పర్యాటక అభివృద్ధి దిశగా చేపట్టిన ఈ ప్రయత్నం తదుపరి దశల్లో ఎలాంటి రూపం దాల్చుతుందో వేచి చూడాలి.

దేవరకొండ నుంచి బీసీల మద్దతుతో లంబాడా అభ్యర్థిని బరిలోకి దింపుతాం: మంత్రిని చేస్తాం

-ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



దేవరకొండ, అక్టోబర్ 27:మహాప్రభ

తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేపట్టిన బీసీ రాజ్యాధికార యాత్ర 34వ రోజుకు చేరుకుంది. మంగళవారం చారకొండ నుంచి పాదయాత్రగా దేవరకొండ పట్టణానికి చేరుకున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు నల్గొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు వైద్యం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డప్పు చప్పుళ్లు, కోలాటాలు, పార్టీ నాయకులు, కార్యకర్తల సందడి మధ్య మల్లన్నకు స్వాగతం పలికారు.

అనంతరం దేవరకొండ పట్టణంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో తీన్మార్ మల్లన్న ప్రసంగించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల విధానాలు, బీసీ రిజర్వేషన్లు, బడ్జెట్ కేటాయింపులు, గిరిజన సంక్షేమ నిధుల వినియోగం, దేవరకొండ నియోజకవర్గ రాజకీయాలు, జనాభా లెక్కలు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై ఆయన మాట్లాడారు. ముఖ్యంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జానారెడ్డిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడం నుంచి దేవరకొండ రాజకీయాల వరకు జానారెడ్డి పెత్తనమే కొనసాగుతోందని ఫైర్ అయ్యారు. వచ్చే ఎన్నికల్లో జానారెడ్డి ఇద్దరు కుమారులను లంబాడా అభ్యర్థుల చేతిలో ఓడిస్తానంటూ దేవరకొండ వేదికగా బహిరంగ సవాల్ విసిరారు.

తెలంగాణలో బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ అధికారం దక్కాలనే లక్ష్యంతోనే తెలంగాణ రాజ్యాధికార పార్టీని స్థాపించినట్లు మల్లన్న తెలిపారు. 2025 సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లో మేధావులు, ప్రొఫెసర్లు, బీసీ నాయకులంతా కలిసి చర్చించి పేద వర్గాల ఆశలు, ఆశయాల నుంచి తెలంగాణ రాజ్యాధికార పార్టీని ఏర్పాటు చేశారని వివరించారు.

తెలంగాణలో ఇప్పటివరకు రాజకీయ అధికారం రెడ్డి,వెలమల సామాజికవర్గాల చేతుల్లోనే కేంద్రీకృతమైందని, జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం దక్కడం లేదని అభిప్రాయపడ్డారు. అందుకే ఆయా వర్గాలను రాజకీయంగా ఏకం చేసి అధికారంలో భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో పార్టీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాను పదేళ్లపాటు పోరాటం చేశానని మల్లన్న గుర్తుచేశారు. కేసీఆర్ పాలనలో వందలాది కేసులు ఎదుర్కొంటూ, అనేక ఇబ్బందులు భరిస్తూ ఒంటరిగా పోరాడానని పేర్కొన్నారు. తాను కేసీఆర్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో ఉన్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డిని ఉద్దేశించి 'మచ్చర్ పైల్వాన్ రేవంత్ రెడ్డి' అంటూ చురకలు అంటించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తాను కూడా కృషి చేశానని చెప్పారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాటలను నమ్మి ఆ పార్టీకి మద్దతుగా ప్రచారం చేసినట్లు వివరించారు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలనే ఉద్దేశంతో తాను రాష్ట్రవ్యాప్తంగా 47 నియోజకవర్గాల్లో ప్రచారం చేశానని మల్లన్న తెలిపారు. తాను ప్రచారం చేసిన 47 నియోజకవర్గాల్లో 42 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలను నమ్మి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చామని, ముఖ్యంగా బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు, సంక్షేమ నిధుల విషయంలో కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని ఆశించామని చెప్పారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ నాయకులు బీసీలకు ఇచ్చిన హామీలను విస్మరించారని, కులగలన చేసి బీసీల లెక్కలు తప్పుగా చూపించారని అందుకే ఆ లెక్కలను తగలబెట్టానని అన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని మల్లన్న గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు, మూడేళ్లు గడిచినా ఆ హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు. బీసీలకు రిజర్వేషన్లు దక్కకుండా అడ్డుకోవడంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జానారెడ్డి పాత్ర ఉందని,జానారెడ్డి రెడ్డి సామాజికవర్గానికి చెందిన కొందరిని ముందుపెట్టి హైకోర్టులో కేసులు వేయించారని, తద్వారా బీసీలకు రావాల్సిన 42 శాతం రిజర్వేషన్లను అడ్డుకున్నారని అన్నారు. బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని ఒకవైపు హామీలు ఇస్తూ, మరోవైపు వాటిని అడ్డుకునే ప్రయత్నాలు చేయడం పసిగట్టే ఆ పార్టీని నిలదీసానని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలోని ఐదో అంశం ప్రకారం బీసీల సంక్షేమానికి ప్రతి సంవత్సరం రూ. 20 వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారని మల్లన్న గుర్తుచేశారు.

ఐదేళ్లలో మొత్తం రూ.లక్ష కోట్లు బీసీల అభివృద్ధి కోసం ఖర్చు చేస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రకటించారని తెలిపారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీ అమలుకు నోచుకోలేదని అన్నారు. ఈ విషయంపై తాను శాసనమండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నించానని, బీసీలకు కేటాయించిన నిధులు, ఖర్చు చేసిన మొత్తాల వివరాలను అధికారికంగా అడిగానని చెప్పారు.

13 ఎకరాల వరి పంట ఎండిపోయింది..

రైతు కన్నీటికి ఎవరు బాధ్యులు

-కోయిల్‌సాగర్‌లో నీళ్లున్నా పంటలకు అందని దుస్థితి..

-ఉమ్మడి పాలమూరును కరువు జిల్లాగా ప్రకటించాలి: మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి





దేవరకద్ర నియోజకవర్గం అక్టోబర్ 27 మహాప్రభ

దేవరకద్ర మండలం డోకూర్ గ్రామంలో పంట చేతికొచ్చే చివరి దశలో నీరు అందక వరి పంట ఎండిపోవడంతో ఓ రైతు కుటుంబం పెట్టిన పెట్టుబడి నేలపాలైంది. 13 ఎకరాల్లో సాగు చేసిన వరి పంట పూర్తిగా ఎండిపోవడంతో రైతు జానకమ్మ తన ఆవేదనను వ్యక్తం చేస్తూ కన్నీటిపర్యంతమైంది. దేవరకద్ర మండలం డోకూరు గ్రామంలో ఎండిపోయిన వరి పొలాలను దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరిశీలించి, బాధిత రైతులను పరామర్శించారు. రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకున్న ఆయన.. పంటల చివరి దశలోనైనా నీరు అందించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

పెట్టుబడి రూ.5 లక్షలు.. మిగిలింది కన్నీళ్లే!

డోకూరు గ్రామానికి చెందిన జానకమ్మ నాలుగు ఎకరాలు, కౌలుకు తీసుకున్న మరో తొమ్మిది ఎకరాల్లో వరి సాగు చేయగా.. మొత్తం 13 ఎకరాల్లో పంట ఎండిపోయిందని ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. సాగు కోసం సుమారు రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టినా, కనీసం ఐదు రూపాయల ఆదాయం కూడా వచ్చే పరిస్థితి లేదని రైతు పడుతున్న ఆవేదనను వివరించారు. పంటను కాపాడుకోవాలనే ఆశతో శ్రమించిన రైతు చివరకు కన్నీరు పెట్టుకోవాల్సి రావడం బాధాకరమన్నారు.

జానకమ్మ వంటి రైతులు పొలాల్లో నిలబడి కన్నీళ్లు పెట్టుకునే పరిస్థితి రాష్ట్రానికి మంచిది కాదని ఆయన పేర్కొన్నారు. రైతుల కష్టాలను మాటల్లో పరామర్శించడమే కాకుండా, పంటలను కాపాడేందుకు అవసరమైన నీటిని అందించడం, నష్టపోయిన వారికి తగిన పరిహారం చెల్లించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

చివరి తడి అందక వందల ఎకరాలకు నష్టం

డోకూరు పరిసర ప్రాంతాల్లో సుమారు 400 ఎకరాల వరి పంట ఎండిపోయిందని ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. పంట చివరి దశలో అవసరమైన నీరు అందకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. వానాకాలం పంటలను సైతం కాపాడుకోలేని పరిస్థితులు నెలకొనడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

పంట చేతికొచ్చే కీలక సమయంలో నీటి సరఫరా నిలిచిపోతే రైతులు పెట్టిన పెట్టుబడితోపాటు నెలల తరబడి చేసిన శ్రమ కూడా వృథా అవుతుందని పేర్కొన్నారు. సాగునీటి నిర్వహణలో ముందస్తు ప్రణాళిక, సమయానుకూల నిర్ణయాలు ఎంత ముఖ్యమో ప్రస్తుత పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయని అన్నారు.

కోయిల్‌సాగర్ నీళ్లతో గతంలో రెండు పంటలు.. ఇప్పుడు ఎందుకీ పరిస్థితి?

గతంలో కోయిల్‌సాగర్ నుంచి దేవరకద్ర పెద్ద చెరువుకు నీటిని విడుదల చేసేవారమని, అక్కడి నుంచి వరుసగా చెరువులు నిండేవని ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గుర్తుచేశారు. 2018 నుంచి 2023 వరకు రెండు పంటలకు సాగునీరు అందించిన సందర్భాలున్నాయని తెలిపారు. అప్పట్లో నీరు అందిన ప్రాంతాల్లో ఇప్పుడు పంటలు ఎందుకు ఎండిపోతున్నాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

జూరాలకు నీరు వచ్చినప్పటికీ ఎత్తిపోతల ద్వారా సాగునీటిని తరలించడంలో జాప్యం జరిగిందని ఆయన ఆరోపించారు. సుమారు 40 రోజుల తర్వాత కోయిల్‌సాగర్ ఎత్తిపోతల ప్రక్రియ ప్రారంభించారని పేర్కొన్నారు. నీటి అవసరాన్ని ముందుగానే గుర్తించి చర్యలు తీసుకుని ఉంటే రైతులకు ఈ స్థాయిలో నష్టం జరిగేది కాదని అభిప్రాయపడ్డారు.

పెద్దవాగులోనూ కృష్ణా జలాలు పారించలేకపోయామని, వానాకాలంలోనే వాగు పూర్తిగా ఎండిపోయిన పరిస్థితి కనిపించిందని తెలిపారు. సాగునీటి వనరులు, నీటి లభ్యత, పంపిణీ వ్యవస్థపై సమగ్రంగా సమీక్షించి రైతులకు మేలు జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు.

కోయిల్‌సాగర్ నీటి తరలింపు ప్రతిపాదనపై పునరాలోచించాలి

కోయిల్‌సాగర్ నుంచి లగచర్లకు నీటిని తరలించేందుకు సర్వే జరుగుతోందని ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే సాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేవరకద్ర ప్రాంత రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రతిపాదనపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.

స్థానిక సాగునీటి అవసరాలు తీరకముందే నీటి తరలింపు ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లడం వల్ల ఈ ప్రాంత రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. కోయిల్‌సాగర్ నీటిని వినియోగించే ప్రాంతాల అవసరాలను సమగ్రంగా పరిశీలించి, రైతులకు నష్టం జరగని విధంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

ఉమ్మడి పాలమూరును కరువు జిల్లాగా ప్రకటించాలి

పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఉమ్మడి పాలమూరు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం అందించాలని కోరారు.

ముఖ్యమంత్రి పెద్ద మనసుతో రైతుల పరిస్థితిని అర్థం చేసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పంటలు పూర్తిగా దెబ్బతిన్న తర్వాత సాయం ప్రకటించడం కంటే, చివరి దశలోనైనా సాగునీరు అందించి పంటలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

రైతులు అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తారని.. చివరికి నీరు అందక పంటలు ఎండిపోతే వారి కుటుంబాల జీవనాధారం దెబ్బతింటుందని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని, రైతు కుటుంబాలను కాపాడాలంటే సాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టడంతోపాటు నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు.

రైతులకు అండగా నిలిచిన నాయకులు

డోకూరు గ్రామంలో సింగిల్ విండో చైర్మన్ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ పర్యటన నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ డోకూరు నరేందర్‌రెడ్డి, దేవరకద్ర మున్సిపాలిటీ ఒకటో వార్డు కౌన్సిలర్ మాధవి యుగంధర్‌రెడ్డి, గోపన్‌పల్లి భాస్కర్‌రెడ్డి, ఆశన్న, జట్టి నరసింహారెడ్డి జీనుగరాల రాము, దేవరకద్ర అడ్డా చౌదర్‌పల్లి చల్మారెడ్డి యుగంధర్‌రెడ్డితోపాటు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com